మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

శుక్రవారం FRIDAY 9-7-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 2 Volume:2 | సంచిక: 10 Issue: 10

Circulated to Telangana
Published from Jagitial

శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - గ్రీష్మ ఋతువు జ్యేష్ఠ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - తె. 5:52 సూర్యాస్తమయం - సా. 6:50 తిథి దశమి ఉ. 8:14 వరకు తరువాత ద్వాదశి సంస్కృత వారం భృగు వాసరః నక్షత్రం భరణి మ. 1:10 వరకు తరువాత కృతిక యోగం ధృతి ఉ. 7:11 వరకు కరణం విష్టి ఉ. 8:14 వరకు బవ సా. 6:48 వరకు వర్జ్యం రా. 12:09 నుండి రా. 1:36 వరకు దుర్ముహూర్తం ఉ. 8:28 నుండి ఉ. 9:19 వరకు మ. 12:47 నుండి మ. 1:39 వరకు రాహుకాలం ఉ. 10:44 నుండి మ. 12:21 వరకు యమగండం మ. 3:36 నుండి సా. 5:13 వరకు గుళికాకాలం ఉ. 7:29 నుండి ఉ. 9:06 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:16 నుండి తె. 5:04 వరకు అమృత ఘడియలు ఉ. 8:46 నుండి ఉ. 10:15 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:55 నుండి మ. 12:47 వరకు గమనిక: "ం" అనగా మరుసటి రోజున



## ఏఐ ఇల్లు.. ఇండియా!

### డేటా సెంటర్లకు గ్లోబల్ హబ్‌గా భారత్

### గూగుల్, మైక్రోసాఫ్ట్, అమెజాన్ భారీ పెట్టుబడులు

న్యూఢిల్లీ, జూలై 9: కృత్రిమ మేధ ఆధారిత డేటా సెంటర్ల ఏర్పాటులో భారత్ ప్రపంచ ప్రధాన కేంద్రంగా వేగంగా ఎదుగుతోంది. ప్రపంచ టెక్ దిగ్గజాలు గూగుల్, మైక్రోసాఫ్ట్, అమెజాన్తో పాటు దేశీయ పారిశ్రామిక సంస్థలు కూడా బిలియన్ల డాలర్ల పెట్టుబడులతో ఏఐ-సిద్ధమైన డేటా సెంటర్ల నిర్మాణానికి ముందుకొస్తున్నాయి. భారత్‌లో ఏర్పడుతున్న ఈ డేటా సెంటర్లు భవిష్యత్ తరువాయి 2 వ పేజీలో...



## భారత్.. భాగ్యవంతురాలే! 2

### ఆర్థిక వ్యవస్థ బలంగానే ఉంది

### చమురు షాక్ ప్రభావం స్వల్పమే

### అంతర్జాతీయ ద్రవ్యనిధి వెల్లడి



# 48 గంటల డెడ్‌లైన్

## మా 38 డిమాండ్లు నెరవేర్చాల్సిందే

### పాక్ ప్రభుత్వానికి జేఏఏసీ అల్టిమేటం.. పీవోకేలో తీవ్ర ఉద్రిక్తత.. 27న భారీ మార్చ్!

పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)లో పరిస్థితులు మరోసారి ఉద్రిక్తంగా మారాయి. జమ్ము కశ్మీర్ జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ (జేఏఏసీ) తమ 38 డిమాండ్లను నెరవేర్చాలంటూ ఇస్లామాబాద్ ప్రభుత్వానికి 48 గంటల గడువు విధిస్తూ అల్టిమేటం జారీ చేసింది. తమ డిమాండ్లను పరిష్కరించకపోతే తీవ్రస్థాయిలో తుది దశ పోరాటం చేపడతామని హెచ్చరించింది. ఈ నెల 27న పీఓకేలో ప్రాంతీయ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యత సంతరించుకుంది. పాకిస్థాన్‌లో స్థిరపడిన కశ్మీరీ శరణార్థులకు కేటాయించిన 12 అసెంబ్లీ స్థానాలను రద్దు చేయాలనే నిర్ణయం తాజా ఆందోళనలకు ప్రధాన కారణమైంది. ఈ నిర్ణయం ద్వారా పాక్ కేంద్ర ప్రభుత్వం స్థానిక రాజకీయాల్లో అనవసరంగా జోక్యం చేసుకుంటోందని జేఏఏసీ ఆరోపిస్తోంది.

ముజఫరాబాద్: ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానున్న తరుణంలో, ముజఫరాబాద్‌కు భారీ నిరసన ర్యాలీ నిర్వహించాలని కమిటీ పిలుపునిచ్చింది. దీంతో అక్కడ తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పౌర సమాజం, వాణిజ్య, విద్యార్థి సంఘాలతో 2023లో ఏర్పాటైన జేఏఏసీ, పెరిగిన ధరలు, విద్యుత్ ఛార్జీలు, గోధుమ పిండిపై సబ్సిడీ వంటి డిమాండ్లతో ఈ ఏడాది మే నెలలో చేపట్టిన భారీ నిరసనలతో వెలుగులోకి వచ్చింది. మంగ్లా డ్యామ్ వంటి ప్రాజెక్టుల ద్వారా స్థానికంగా ఉత్పత్తి తరువాయి 2 వ పేజీలో...

## టీజీఎస్ ఆర్టీసీలో 1500 కండక్టర్ పోస్టులు

### పర్మినెంట్ ప్రాతిపదికన ఉద్యోగాల భర్తీ

### రాత పరీక్ష, ఇంటర్వ్యూ లేకుండానే నియామకాలు

### పదో తరగతి మార్కుల ఆధారంగా ఉద్యోగాలు

హైదరాబాద్, జూలై 9 (ఈవార్తలు): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో ఖాళీగా ఉన్న 1,500 కండక్టర్ పోస్టుల భర్తీకి సర్కారు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ నియామక ప్రక్రియను ఆర్టీసీ యాజమాన్యమే నేరుగా చేపట్టబోతుండగా... చాలా సంవత్సరాల తర్వాత తెలంగాణలో పర్మినెంట ప్రాతిపదికన కండక్టర్ ఉద్యోగాలను భర్తీ చేయనున్నారు. ఈ ఉద్యోగాలకు తరువాయి 2 వ పేజీలో...

## బంగారం-వెండి ధరలు

బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.14,444 |
| వెండి (కిలో): | రూ.2,45,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.4,877 |



IDEAL FOR
Maritime • Disaster Response
Remote Operations • Pilgrims
Adventure Travel
₹1,34,166/-
(Inclusive of all taxes)

## బీఎస్ఎన్ఎల్ శాటిలైట్ ఫోన్ రూ.1.34 లక్షలు

### కొనుగోలుకు డాట్ అనుమతి తప్పనిసరి

### రక్షణ, విపత్తు సేవలకు ప్రత్యేకంగా రూపకల్పన

బీఎస్ఎన్ఎల్ కొత్త శాటిలైట్ ఫోన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. అడవులు, సముద్ర ప్రాంతాలు, కొండ ప్రాంతాలు, విపత్తులు సంభవించిన చోట్ల కూడా ఈ ఫోన్‌తో మాట్లాడొచ్చు. అయితే ఇది సాధారణ స్మార్ట్‌ఫోన్‌లా ఎవరైనా కొనుగోలు చేయలేరు. ఈ ఫోన్ ధర రూ.1,34,166. కొనుగోలు చేయాలంటే ముందుగా కేంద్ర టెలికమ్యూనికేషన్స్ శాఖ (డాట్) నుంచి ప్రత్యేక అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది.

న్యూఢిల్లీ: అనుమతి లేకుండా శాటిలైట్ ఫోన్‌ను ఉండటం లేదా వినియోగించడం చట్టపరమైన సమస్యలకు దారి తీసే అవకాశం ఉందని బీఎస్ఎన్ఎల్ తెలిపింది. సాధారణ మొబైల్ ఫోన్లు సమీపంలోని టవర్ల ద్వారా పనిచేస్తాయి. కానీ ఈ శాటిలైట్ ఫోన్ నేరుగా ఉపగ్రహాలతో అనుసంధానం అవుతుంది. అందుకే సెల్యులర్ నెట్‌వర్క్ లేని ప్రాంతాల్లో కూడా వాయిస్ కాల్స్ చేసుకోవచ్చు. ఈ సేవల కోసం అంతర్జాతీయ శాటిలైట్ తరువాయి 2 వ పేజీలో...



# ఒలింపిక్స్ నా లక్ష్యం

### హైదరాబాద్‌లో నిర్వహించేలా కృషి చేస్తా

### ఖేలో ఇండియా పోటీలను విజయవంతం చేస్తాం

### 82 ఎకరాల్లో అత్యాధునిక వసతులతో స్పోర్ట్స్ వర్సిటీ

### క్రీడల్లో రాణిస్తే ప్రభుత్వ ఉద్యోగం: సీఎం రేవంత్

హైదరాబాద్, జూలై 9 (ఈవార్తలు): భారతదేశం 2036 ఒలింపిక్ క్రీడల నిర్వహణ రేసులో నిలుస్తున్న తరుణంలో ఆ క్రీడలకు ఆతిథ్యం ఇవ్వడానికి తెలంగాణ సర్వసన్నద్ధంగా ఉందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్ నగరాన్ని ప్రపంచ స్థాయి క్రీడా హబ్‌గా మార్చేందుకు ప్రభుత్వం నూతన క్రీడా విధానాన్ని అమల్లోకి తెచ్చింది. ఇందులో భాగంగా గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షురాలు, లెజెండరీ అథ్లెట్ పీటీ ఉషతో కలిసి గచ్చీబౌలి స్పోర్ట్స్ డిస్ట్రిక్ట్, యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీకి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. రాబోయే నవంబర్‌లో తరువాయి 2 వ పేజీలో...



## బీఆర్ఎస్ ఖాతాలో 1,400 కోట్ల దొంగ సొమ్ము

### క్విడ్ ప్రోకో ద్వారా సేకరించిన నిధులే అవి

### టీఆర్ఎస్ చీఫ్ కవిత సంచలన ఆరోపణలు

### ప్రాణం ఉన్నంత వరకు బీఆర్ఎస్‌లో చేరనని వ్యాఖ్య

కొత్తగూడెం, జూలై 9 (ఈవార్తలు): బీఆర్ఎస్ పార్టీపై తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీ బ్యాంకు ఖాతాలో ఉన్న రూ. 1,400 కోట్ల నిధులు స్వచ్ఛమైనవి కావని అన్నారు. అవన్నీ క్విడ్ ప్రోకో ద్వారా వచ్చినవేనని ఆరోపించారు. ఆ నిధులపై తక్షణమే సమగ్ర విచారణ జరిపించి, ఆ డబ్బును తెలంగాణ ఉద్యమకారుల కుటుంబాలకు పంచాలి అని డిమాండ్ చేశారు. తన కంఠంలో తరువాయి 2 వ పేజీలో...



## 28 మంది సజీవ దహనం

### చైనా షూ ఫ్యాక్టరీలో ఘోర అగ్నిప్రమాదం

చైనాలో ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. ఆగ్నేయ చైనాలోని ఫుజియాన్ ప్రావిన్స్‌లో గల ఒక షూ ఫ్యాక్టరీలో గురువారం భారీ మంటలు చెలరేగడంతో 28 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. భవనంలో మరికొందరు చిక్కుకుని ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. 2

## విశ్వవాణి



మంచినీరు, ఉప్పునీరు కలిసే సమయంలో కొంత శక్తి నిశ్శబ్దంగా వృథా అవుతుంటుంది. ఆ సహజ సిద్ధమైన ప్రక్రియను ఒడిసిపట్టి విద్యుత్‌ను తయారు చేసే సరికొత్త సాంకేతికతను జపాన్ శాస్త్రవేత్తలు విజయవంతంగా ఆవిష్కరించారు. జపాన్‌లోని తీరప్రాంత నగరం ఫుకుయోకాలోని 'మామిజుపియా' డీశాలినేషన్ కేంద్రంలో దేశంలోనే మొట్టమొదటి ఒస్మోటిక్ పవర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. డెన్మార్క్ తర్వాత ప్రపంచంలోనే ఇలాంటి సాంకేతికతతో నడుస్తున్న రెండో ప్లాంట్ ఇది కావడం విశేషం. నగరాలు సాధారణంగా వదిలేసే అత్యధిక ఉప్పు సాంద్రత గల నీరు, శుద్ధి చేసిన మురుగునీటిని ఉపయోగించి దీని ద్వారా విద్యుదుత్పత్తి చేస్తున్నారు.



## ఇటు ఇరాన్.. అటు అమెరికా

### పశ్చిమాసియాలో బాంబుల మోత

### చాబహార్ పోర్టుపై అమెరికా అటాక్

### కీలక ఆక్ తఖే ఖాన్ రైల్వే బ్రిడ్జి ధ్వంసం

### యూఎస్ స్థావరాలపై ఇరాన్ ప్రతిదాడులు

## శాంతించండి

### దౌత్యమే అసలైన మార్గం

### మెల్‌బోర్న్ వేదికగా ప్రధాని మోదీ సూచన

ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతం కొనసాగుతున్న అన్ని రకాల ఘర్షణలు, వివాదాలను చర్చలు, దౌత్య నీతి ద్వారానే పరిష్కరించుకోవడం సాధ్యమవుతుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గురువారం స్పష్టం చేశారు.

మెల్‌బోర్న్: పశ్చిమ ఆసియా (మిడిల్ ఈస్ట్)లో ఉద్రిక్తతలు తీవ్రస్థాయికి చేరిన తరుణంలో మెల్‌బోర్న్‌లో ప్రధాని మోదీ ఈ వ్యాఖ్యలున చేశారు. ఆస్ట్రేలియా ప్రధానమంత్రి ఆంథోనీ అల్బనీస్‌తో కలిసి 'ఇండియా-ఆస్ట్రేలియా సీఈఓ ఫోరమ్'లో మోదీ ప్రసంగించారు. వాణిజ్యం, రక్షణ, విద్య, ఇరు దేశాల ప్రజల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేయడంపై ఇరువురు నేతలు చర్చలు తరువాయి 2 వ పేజీలో...





2

## సియాచిన్‌లో మహిళా అధికారిగా కెప్టెన్ శివ చౌహాన్

### కుమార్ పోస్ట్‌లో విధులు..

### 3 నెలల పాటు ఇంజినీరింగ్ బృందానికి నేతృత్వం



2

## బండి భగీరథ్‌కు బెయిల్

## రూ.2 వేల నోట్లు ఉంటే మార్చుకోండి

### ఇప్పటికీ చెల్లుబాటు అవుతాయి: ఆర్బీఐ

### ఇంకా మార్కెట్‌లో రూ.5,451 కోట్ల నోట్లు

2



## రాశి ఫలాలు

10.7.2026

మేషం: అనుకోని ప్రయాణాలు చేయాల్సి రావచ్చు. వ్యాపారంలో భాగస్వాములతో చిన్నపాటి విభేదాలు వచ్చే సూచనలు ఉన్నాయి, కాబట్టి సర్దుకుపోవడం మంచిది. ఖర్చులు పెరిగినప్పటికీ సమయానికి చేతికి డబ్బు అందుతుంది.

వృషభం: ముఖ్యమైన వ్యవహారాలు సానుకూలంగా సాగుతాయి. ఉద్యోగ ప్రయత్నాలు వేగం పుంజుకుంటాయి. పాత మిత్రుల లేదా సహోద్యోగుల నుండి ఆశించిన సహాయం లభిస్తుంది. సాయంత్రం విందు వినోదాల్లో పాల్గొంటారు.

మిధునం: మానసిక ప్రశాంతత లభిస్తుంది. నూతన పెట్టుబడుల విషయంలో తొందరపాటు నిర్ణయాలు తీసుకోకూడదు. కుటుంబంలో మీ అభిప్రాయాలకు ప్రాధాన్యత పెరుగుతుంది. గత కొన్ని రోజులుగా వేధిస్తున్న ఆరోగ్య సమస్యలు కుదుటపడతాయి.

కర్కాటకం: ఉద్యోగంలో అదనపు బాధ్యతలు పెరుగుతాయి. శ్రమ ఎక్కువైనా అధికారుల నుండి మంచి గుర్తింపు లభిస్తుంది. కోర్టు లేదా భూగృహ వ్యవహారాలు మీకు సానుకూలంగా మారే అవకాశం ఉంది.

సింహం: ప్రయాణాల విషయంలో అప్రమత్తత అవసరం. అనుకున్న పనులు అనుకున్నట్టు సాగక కాస్త నిరాశ కలిగినా, ఓపిక పట్టడం మంచిది. పిల్లల ప్రవర్తన మరియు చదువు మీకు సంతోషాన్ని కలిగిస్తాయి.

కన్య: సమాజంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి. చాలా రోజులుగా ఉన్న ఆర్థిక ఇబ్బందులు తొలగిపోయి ఊరట లభిస్తుంది. గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు. బంధువుల రాకతో ఇల్లు సందడిగా మారుతుంది.

తుల: వృత్తి, వ్యాపారాలలో లాభాలు బాగుంటాయి. నూతన పరిచయాలు ఏర్పడతాయి, అవి భవిష్యత్తుకు ఉపయోగపడతాయి. మీ మాట తీరుతో అందరినీ ఆకట్టుకుంటారు. మానసికంగా చాలా ఉల్లాసంగా గడుపుతారు.

వృశ్చికం: శారీరక శ్రమ పెరగడం వల్ల కాస్త అలసటగా అనిపిస్తుంది. అయినప్పటికీ పట్టుదలతో శత్రువులపై విజయం సాధిస్తారు. పెద్దల ఆశీస్సులు, సలహాలు లభిస్తాయి. ఆస్తి వివాదాలు ఒక కొలిక్కి వస్తాయి.

ధనస్సు: నిరుద్యోగులకు ఇంటర్వ్యూలలో విజయం లభిస్తుంది. దూర ప్రాంతాల నుండి ఒక మంచి వార్త వింటారు. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. వ్యాపార విస్తరణకు సంబంధించిన ప్రణాళికలు అమలు చేయడానికి మంచి రోజు.

మకరం: ఖర్చుల విషయంలో చాలా నియంత్రణ అవసరం. అనవసర వస్తువులపై డబ్బు వృథా కావచ్చు. ఇతరుల విషయాలలో జోక్యం చేసుకోకుండా ఉండటం శ్రేయస్కరం. కొన్ని ఇబ్బందులు ఎదురైనా ధైర్యంతో అధిగమిస్తారు.

కుంభం: కుటుంబ సభ్యుల మధ్య ఉన్న పాత మనస్పర్థలు తొలగిపోతాయి. ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి. నూతన వస్తు ఆభరణాలు కొనుగోలు చేసే అవకాశం ఉంది. ప్రయాణాలు కలసివస్తాయి.

మీనం: చేపట్టిన పనులను అనుకున్న సమయానికి విజయవంతంగా పూర్తి చేస్తారు. సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుంది. ఆరోగ్యం పట్ల కొద్దిగా శ్రద్ధ వహించండి. శుభవార్త వినే సూచనలు ఉన్నవి.

# ఏఐ ఇల్లు.. ఇండియా!

మొదటి పేజీ తరువాయి

ఏఐ కంప్యూటింగ్‌కు కీలక మౌలిక సదుపాయాలుగా మారనున్నాయి. ప్రభుత్వ ప్రోత్సాహక విధానాలు, డిజిటల్ మౌలిక వసతుల విస్తరణ, పునరుత్పాదక ఇంధన వినియోగానికి ప్రాధాన్యం వంటి అంశాలు పెట్టుబడులను మరింత ఆకర్షిస్తున్నాయి. ముంబై, చెన్నై వంటి తీర నగరాలు సముద్ర అడుగు ఫైబర్ కేబుల్ నెట్‌వర్క్‌లకు సమీపంలో ఉండటంతో హైపర్‌స్కేల్ డేటా సెంటర్లకు అనువైన కేంద్రాలుగా మారాయి. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం కూడా వేగంగా అభివృద్ధి చెందుతున్న ఏఐ హబ్‌గా నిలుస్తోంది. విశాఖలో గూగుల్ 15 బిలియన్ డాలర్ల పెట్టుబడి ప్రకటించగా, అదానీ గ్రూప్ 2035 నాటికి 5 గిగావాట్ల సామర్థ్యంతో ఏఐ ప్లాట్‌ఫామ్ నిర్మాణానికి 100 బిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టనున్నట్లు ప్రకటించింది. తీర ప్రాంతాలతో పాటు హైదరాబాద్, పుణె వంటి అంతర్గత నగరాలు కూడా క్లౌడ్ కంప్యూటింగ్, ఏఐ మౌలిక సదుపాయాల విస్తరణలో వేగంగా ముందుకు సాగుతున్నాయి. దీంతో దేశ డిజిటల్ సామర్థ్యం మరింత విస్తరిస్తోంది. ఏఐ డేటా సెంటర్ల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం అనుకూల విధానాలను అమలు చేస్తోంది. దీర్ఘకాలిక రుణ సౌకర్యాలు, పన్ను రాయితీలు, గ్రీన్ ఏఐ మౌలిక సదుపాయాల్లో పెట్టుబడులు పెట్టే సంస్థలకు 2047 వరకు పన్ను సెలవులు వంటి ప్రోత్సాహకాలు కల్పిస్తోంది. ప్రస్తుతం కొనసాగుతున్న భారీ పెట్టుబడుల నేపథ్యంలో 2030 నాటికి భారత్‌లో డేటా సెంటర్ల నిర్వహణ సామర్థ్యం సుమారు 6.5 గిగావాట్లకు పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. పెరుగుతున్న పెట్టుబడులు, బలమైన విధానాలు, విస్తరిస్తున్న డిజిటల్ ఎకోసిస్టమ్‌తో భారత్ ప్రపంచ ఏఐ రంగంలో అమెరికా, చైనా తర్వాత అత్యంత కీలక దేశంగా అవతరించే దిశగా వేగంగా అడుగులు వేస్తోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# టీజీఎస్ ఆర్టీసీలో 1500 కండక్టర్ పోస్టులు

మొదటి పేజీ తరువాయి

ఎలాంటి రాత పరీక్ష, ఇంటర్వ్యూ నిర్వహించడం లేదు. కేవలం టెన్త్ క్లాస్ లో సాధించిన మార్కుల శాతాన్ని ప్రాతిపదికగా తీసుకుంటారు. ప్రభుత్వం నిర్దేశించిన రోస్టర్ విధానం, రిజర్వేషన్ నిబంధనల ప్రకారం అభ్యర్థుల మెరిట్ లిస్ట్‌ను సిద్ధం చేసి నేరుగా ఎంపిక ప్రక్రియ చేపడతారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఆర్టీసీలో పర్మినెంట్ బేసిస్‌పై కండక్టర్ పోస్టులను భర్తీ చేయడం ఇదే మొదటిసారి. గత కొన్నేళ్లుగా చాలా మంది ఉద్యోగులు రిటైర్ కావడంతో ఖాళీలు భారీగా పెరిగాయి. ముఖ్యంగా హైదరాబాద్, సికింద్రాబాద్ లాంటి మహానగరాల్లో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ఇప్పటివరకు తాత్కాలికంగా ఔట్‌సోర్సింగ్ సిబ్బందితోనే బస్సులను నడిపించారు. ఇప్పుడు నేరుగా ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి అనుమతి రావడంతో ఆర్టీసీ రూపురేఖలు మారనున్నాయి. అయితే, అఫీషియల్ నోటిఫికేషన్ విడుదలకు ముందు ఒక చిన్న సాంకేతిక సమస్య ఎదురైంది. గతంలో ఎస్ఎస్‌సీ బోర్డు మార్కుల విధానాన్ని అమలు చేయగా.. ఆ తర్వాత కొన్నేళ్ల పాటు జీపీఏ గ్రేడింగ్ విధానాన్ని తెచ్చింది. మళ్లీ ఇటీవల మార్కుల విధానాన్ని కొనసాగిస్తోంది. దీనివల్ల అప్లై చేసుకునే అభ్యర్థుల్లో కొందరికి మార్కులు, మరికొందరికి కేవలం గ్రేడింగ్ మాత్రమే సర్టిఫికేట్లలో ఉన్నాయి. దీంతో జీపీఏ గ్రేడింగ్‌ను మార్కుల శాతంలోకి ఎలా కన్వర్ట్ చేయాలి? ఇరు విధానాల అభ్యర్థులను సమానంగా ఎలా అంచనా వేయాలనే దానిపై స్పష్టత ఇవ్వాలని ఆర్టీసీ అధికారులు ఎస్సెస్సీ బోర్డుకు లేఖ రాశారు. బోర్డు నుంచి ఈ మార్గదర్శకాలు అందిన వెంటనే కండక్టర్ ఉద్యోగాల అధికారిక నోటిఫికేషన్ విడుదల కానుంది.

# భారత్.. భాగ్యవంతురాలే!

న్యూయార్క్: పశ్చిమాసియా ఘర్షణల కారణంగా అంతర్జాతీయ చమురు ధరలు పెరిగినా భారత ఆర్థిక వ్యవస్థ బలంగానే ఉందని అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) పేర్కొంది. తాజా 'వరల్డ్ ఎకనామిక్ అవుట్‌లుక్' నివేదికలో 2026 సంవత్సరానికి భారత వృద్ధి అంచనాను 6.4 శాతానికి స్వల్పంగా తగ్గించినప్పటికీ, 2027లో వృద్ధి మరింత బలపడుతుందని వెల్లడించింది. దేశీయ డిమాండ్ బలంగా ఉండటం, ఇటీవలి ఆర్థిక గణాంకాలు ఆశాజనకంగా ఉండటం భారత ఆర్థిక వ్యవస్థకు మద్దతుగా నిలుస్తున్నాయని ఐఎంఎఫ్ వివరించింది. ఐఎంఎఫ్ రీసెర్చ్ విభాగం అధికారి డెనిజ్ ఇగాన్ మాట్లాడుతూ.. తాజా ఆర్థిక సూచీలు భారత ఆర్థిక వ్యవస్థలో నిలకడను చూపిస్తున్నాయని తెలిపారు. అయితే పశ్చిమాసియా ఉద్రిక్తతలతో పెరిగిన చమురు ధరలు, వాటి ప్రభావం దేశీయ ఇంధన ధరలపై పడటం వల్ల 2026 వృద్ధి అంచనాను స్వల్పంగా తగ్గించాల్సి వచ్చిందన్నారు. ఈ ఇంధన ఒత్తిడి 2027 నాటికి తగ్గుముఖం పట్టడంతో భారత వృద్ధి మళ్లీ 6.5 శాతం స్థాయికి చేరుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై కూడా ఐఎంఎఫ్ తాజా అంచనాలు విడుదల చేసింది. 2026లో ప్రపంచ వృద్ధి 3 శాతం, 2027లో 3.4 శాతంగా ఉంటుందని తెలిపింది. అయితే పశ్చిమాసియా ఘర్షణలు మరింత తీవ్రరూపం దాల్చితే చమురు ధరలు పెరగడంతో పాటు ప్రపంచ మార్కెట్లపై ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం ఉందని హెచ్చరించింది. మరోవైపు కృత్రిమ మేధ (ఏఐ) రంగంలో పెరుగుతున్న పెట్టుబడులు ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు కొంత ఊతమిస్తున్నాయని కూడా ఐఎంఎఫ్ పేర్కొంది.

## బీఆర్ఎస్ ఖాతాలో 1,400 కోట్ల దొంగ సొమ్ము

మొదటి పేజీ తరువాయి

ప్రాణం ఉన్నంత వరకు మళ్లీ బీఆర్ఎస్ పార్టీలో చేరే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. సింగరేణి సంస్థ పరిరక్షణ, కార్మికుల హక్కుల సాధనే ధ్యేయంగా చేపట్టిన 'సింగరేణి బాయి బాట' కార్యక్రమంలో భాగంగా తాను క్షేత్రస్థాయిలో కార్మికులతో మమేకమవుతున్నట్లు కవిత తెలిపారు. ప్రభుత్వ అనాలోచిత విధానాలు, చెల్లించాల్సిన బకాయిల కారణంగా సింగరేణి సంస్థపై పెను భారం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం సంస్థ ఎంతటి ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిందంటే... కనీసం కార్మికులకు అవసరమైన పనిముట్లు (మైనింగ్ పరికరాలు) కూడా కొనలేని దుస్థితి నెలకొందని మండిపడ్డారు. "ఇక్కడ అధికారులకు ఓ రూల్... రాత్రింబవళ్లు కష్టపడే కార్మికులకు మరో రూల్‌లా యాజమాన్యం వ్యవహరిస్తున్నారు" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ వైఖరి వల్ల తెలంగాణ హక్కుగా ఉన్న బొగ్గు బ్లాక్‌లు ప్రైవేట్‌పరం అవుతున్నాయని కవిత విమర్శించారు.

# ఒలింపిక్స్ నా లక్ష్యం

మొదటి పేజీ తరువాయి

ప్రతిష్ఠాత్మక ఖేలో ఇండియా పోటీలను విజయవంతంగా నిర్వహించడంతో పాటు 2036 ఒలింపిక్స్‌కు హైదరాబాద్‌ను ప్రధాన వేదికగా నిలపడమే తమ లక్ష్యమన్నారు. ఇందుకోసం 82 ఎకరాల విస్తీర్ణంలో అత్యాధునిక వసతులతో కూడిన స్పోర్ట్స్ యూనివర్సిటీని, ప్రపంచ స్థాయి స్పోర్ట్స్ అకాడమీని నిర్మిస్తున్నామని వెల్లడించారు. 2028 డిసెంబరు నాటికి ఈ విశ్వవిద్యాలయ నిర్మాణ పనులను పూర్తి చేసి పూర్తిస్థాయిలో ప్రారంభిస్తామన్నారు. గతంలో దేశంలో స్పష్టమైన క్రీడా విధానం లేకపోవడం వల్లే అంతర్జాతీయ వేదికలపై భారత్ వెనుకబడిందని ఆ లోపాన్ని సవరిస్తూ తెలంగాణలో పటిష్టమైన పాలసీని తెచ్చామని చెప్పారు. మహాత్మా గాంధీ నడిపిన యంగ్ ఇండియా పత్రిక స్ఫూర్తితోనే ఈ వర్సిటీకి నామకరణం చేసినట్లు వివరించారు. హైదరాబాద్ గతంలో ఆఫ్రో‌ఏషియన్ గేమ్స్, వరల్డ్ మిలిటరీ గేమ్స్ వంటి అంతర్జాతీయ పోటీలను విజయవంతంగా నిర్వహించిందని అయితే గత 20 ఏళ్లుగా ఆ వైభవాన్ని కోల్పోయిందని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. 23 ఏళ్ల క్రితం నిర్మించిన స్టేడియాలను క్రీడలకు కాకుండా పెళ్లిళ్లకు, రాజకీయ సభలకు వేదికలుగా మార్చేశారని వాటన్నింటినీ తిరిగి పునరుద్ధరిస్తామన్నారు. ఈ స్పోర్ట్స్ యూనివర్సిటీలో ప్రభుత్వ జోక్యం ఏమాత్రం ఉండదని దీనిని పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యం కింద నడుపుతామన్నారు. దీని నిర్వహణ బాధ్యతలను సంజీవ్ గోయెంకా, అభినవ్ బింద్రా, కపిల్ దేవ్, కావ్యా మారన్, ఉపాసన కొణిదెల, రవికాంత్ రెడ్డి వంటి ప్రముఖ క్రీడా, వ్యాపార దిగ్గజాలకు అప్పగిస్తూ పూర్తి స్వేచ్ఛను ఇచ్చినట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు.

# ఇటు ఇరాన్.. అటు అమెరికా

## పశ్చిమాసియాలో బాంబుల మోత

టెహ్రాన్: అమెరికా, ఇరాన్ మధ్య తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం ముగిసినట్టు అగ్రరాజ్యం అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడంతో ఇరు దేశాల మధ్య దాడులు తీవ్రస్థాయికి చేరాయి. ఈ క్రమంలోనే భారత్‌కు వ్యూహాత్మకంగా అత్యంత కీలకమైన చబహార్ పోర్టుపై తాజాగా అమెరికా వైమానిక దాడులు ప్రారంభించింది. చబహార్ అంతటా పేలుళ్లు సంభవించినట్లు నివేదికలు రాగా.. నగరంలోని కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడినట్లు ఇరాన్ ప్రభుత్వ మీడియా తెలిపింది. దెబ్బతిన్న ప్రదేశాలకు అత్యవసర సేవల సిబ్బంది హుటాహుటిన చేరుకుంటుండగా, తాము అనేక పేలుళ్ల శబ్దాలు విన్నామని స్థానికులు తెలిపారు. ఏప్రిల్‌లో అమెరికా-ఇరాన్ కాల్పుల విరమణ ప్రకటించిన తర్వాత ఈవ్యూహాత్మక చాబహార్ ఓడరేవుపై జరిగిన మొదటి దాడి ఇదే. హిందూ మహా సముద్రం నుంచి ఇరాన్ సముద్ర వాణిజ్యానికి అవసరమైన డీప్ వాటర్ పోర్టు ఇక్కడ ఉంది. టెహ్రాన్‌కు ఇది ఆర్థికంగా కీలక ప్రాంతం. భారత్ నిధులతో ఈ పోర్టును అభివృద్ధి చేస్తున్నారు. ఇక్కడి నుంచి అఫ్గానిస్థాన్, మధ్య ఆసియాకు సరకులు రవాణా చేయాలని భారత్ భావిస్తోంది. 'హర్మూజ్ జలసంధిలో స్వేచ్ఛాయుత నౌకాయానానికి ముప్పు కలిగించే ఇరాన్ సామర్థ్యాన్ని మరింత బలహీనపరిచేందుకు సెంట్రల్ కమాండ్ వారిపై అదనపు దాడులు ప్రారంభించింది" ఎక్స్ (ట్విట్టర్)లో సెంట్రల్ కమాండ్ పోస్ట్ చేసింది. "కీలకమైన అంతర్జాతీయ జలమార్గంలో స్వేచ్ఛగా ప్రయాణిస్తున్న వాణిజ్య నౌకలు, పౌర సిబ్బందిపై ఇటీవల జరిగిన దురాక్రమణకు ఇరాన్‌ను అమెరికా బాధ్యురాలిని చేస్తోంది" అని పేర్కొంది. పౌర ఓడరేవులు, కీలకమైన ఇంధన మౌలిక సదుపాయాలు మినహా వాణిజ్య పోర్టులు, మారిటైమ్ ట్రాఫిక్ కంట్రోల్ టవర్, సమీపంలోని సైనిక ఆస్తులపై జరిగాయని ప్రాథమిక నివేదికలు తెలిపాయి.

# 28 మంది సజీవ దహనం

## చైనా షూ ఫ్యాక్టరీలో ఘోర అగ్నిప్రమాదం

ఫుజియాన్: చైనాలో ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. ఆగ్నేయ చైనాలోని ఫుజియాన్ ప్రావిన్స్‌లో గల ఒక షూ ఫ్యాక్టరీలో గురువారం భారీ మంటలు చెలరేగడంతో 28 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. భవనంలో మరికొందరు చిక్కుకుని ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం అక్కడ సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. షూ రాజధానిగా పిలిచే జిన్‌జియాంగ్ నగరంలోని హుయిటెంగ్ షూస్ ఫ్యాక్టరీలో ఈ విషాదం చోటుచేసుకుంది. బహుళ అంతస్తుల భవనంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో పరిసర ప్రాంతమంతా దట్టమైన నల్లటి పొగలు అలుముకున్నాయి. భవనం పైకప్పుపై చిక్కుకున్న కొందరు కార్మికులు ప్రాణరక్షణ కోసం ఆర్తనాదాలు చేస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. సమాచారం అందుకున్న వెంటనే సుమారు 200 మంది అగ్నిమాపక సిబ్బంది 35 అగ్నిమాపక యంత్రాలతో ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. షూ తయారీలో వినియోగించే మండే స్వభావం కలిగిన ముడి పదార్థాల వల్లే మంటలు వేగంగా వ్యాపించినట్లు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ఈ దుర్ఘటనపై చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇదొక భారీ ప్రాణ నష్టమని ఆవేదన వ్యక్తం చేస్తూ, సహాయక చర్యలను వేగవంతం చేయాలని, బాధితుల కుటుంబాలకు అండగా నిలవాలని అధికారులను ఆదేశించారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు.

## సియాచిన్‌లో మహిళా అధికారిగా

# కెప్టెన్ శివ చౌహాన్

### కుమార్ పోస్ట్‌లో విధులు.. 3 నెలల పాటు ఇంజినీరింగ్ బృందానికి నేతృత్వం

న్యూఢిల్లీ: భారత సైనిక చరిత్రలో నూతన అధ్యాయాన్ని లిఖిస్తూ కెప్టెన్ శివ చౌహాన్ అరుదైన ఘనతను సొంతం చేసుకున్నారు. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన యుద్ధ క్షేత్రమైన సియాచిన్ గ్లేసియర్‌లోని 'కుమార్ పోస్ట్'లో ఆపరేషనల్ విధుల్లో నియమితులైన తొలి మహిళా అధికారిగా సరికొత్త చరిత్ర సృష్టించారు. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌కు చెందిన శివ చౌహాన్, 11 ఏళ్ల ప్రాయంలోనే తండ్రిని కోల్పోయారు. తల్లి, సోదరి అండతో అనేక సవాళ్లను అధిగమించి, తన చిన్ననాటి కలను సాకారం చేసుకునే దిశగా సైన్యంలో అడుగుపెట్టారు. 2020లో సివిల్ ఇంజినీరింగ్‌లో బీటెక్ పూర్తి చేసిన ఆమె, సర్వీసెస్ సెలక్షన్ బోర్డు (ఎస్ఎస్బీ) నిర్వహించిన పరీక్షలో ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంక్ సాధించి సత్తా చాటారు. అనంతరం చెన్నైలోని ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీలో శిక్షణ పూర్తి చేసుకుని, 2021 మే నెలలో కార్ప్స్ ఆఫ్ ఇంజినీర్స్‌లో అధికారిగా నియమితులయ్యారు. కఠినమైన శిక్షణ అనంతరం 2023 జనవరి 2న కెప్టెన్ శివ చౌహాన్‌ను సుమారు 15,632 అడుగుల ఎత్తులో ఉన్న కుమార్ పోస్ట్‌లో మూడు నెలల కాలానికి నియమించారు. అక్కడ ఇంజినీరింగ్ బృందానికి నాయకత్వం వహిస్తూ, మైనస్ 40 నుంచి 50 డిగ్రీల సెల్సియస్ గడ్డకట్టే చలిలోనూ హెలిప్యాడ్‌ల నిర్మాణం, ఇతర మౌలిక సదుపాయాల కల్పన మరియు నిర్వహణ బాధ్యతలను ఆమె సమర్థంగా నిర్వర్తించారు.

# బండి భగీరథ్‌కు బెయిల్

హైదరాబాద్, జులై 9 (ఈవార్తలు): కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ్‌కు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. పోక్సో చట్టం కింద నమోదైన కేసులో అతడికి గురువారం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేస్తూ న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసింది. దర్యాప్తునకు పూర్తిగా సహకరించాలని ఈ సందర్భంగా భగీరథ్‌ను హైకోర్టు ఆదేశించింది. ఒక మైనర్ బాలికకు సంబంధించిన ఉదంతంలో మే 8వ తేదీన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో భగీరథ్‌పై పోక్సో కేసు నమోదైంది. ఈ కేసులో మే 16న పోలీసులు అతడిని అరెస్ట్ చేయగా, అప్పటి నుంచి చర్లపల్లి జైలులో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్నాడు. దాదాపు 45 రోజులుగా అతడు జైలులోనే ఉంటున్నాడు. బెయిల్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా భగీరథ్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ, నిందితుడు విద్యార్థి అని, జైలులో ఉండటం వల్ల చదువు నష్టపోతున్నాడని కోర్టుకు విన్నవించారు. అయితే, పబ్లిక్ ప్రాసిక్యూటర్ బెయిల్‌ను వ్యతిరేకించారు. దర్యాప్తు కీలక దశలో ఉందని, నిందితుడిని విడుదల చేస్తే సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉందని వాదించారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ కె. సుజన భగీరథ్‌కు బెయిల్ మంజూరు చేశారు.

## రూ.2 వేల నోట్లు ఉంటే మార్చుకోండి

### ఇప్పటికీ చెల్లుబాటు అవుతాయి: ఆర్బీఐ

### ఇంకా మార్కెట్‌లో రూ.5,451 కోట్ల నోట్లు

న్యూఢిల్లీ: దేశంలో చెలామణిలో ఉన్న రూ.2000 నోట్లలో దాదాపు 98.47 శాతం వెనక్కి వచ్చినట్లు భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) వెల్లడించింది. దాదాపు మూడేళ్ల క్రితం ఈ నోట్లను ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించిన ఆర్బీఐ, తాజాగా ప్రస్తుత పరిస్థితిపై గణాంకాలను విడుదల చేసింది. కరెన్సీ నిర్వహణలో భాగంగా 2023 మే 19న రూ.2000 నోట్లను చెలామణి నుంచి ఉపసంహరించుకుంటున్నట్లు ఆర్బీఐ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో మార్కెట్‌లో మొత్తం రూ.3.56 లక్షల కోట్ల విలువైన రూ.2000 నోట్లు ఉన్నాయి. తాజా గణాంకాల ప్రకారం, ఈ ఏడాది ఏప్రిల్ 30 నాటికి చెలామణిలో ఉన్న నోట్ల విలువ కేవలం రూ.5,451 కోట్లకు పడిపోయిందని ఆర్బీఐ తెలిపింది.

## బీఎస్ఎన్ఎల్ శాటిలైట్ ఫోన్

# రూ.1.34 లక్షలు

మొదటి పేజీ తరువాయి

నెట్‌వర్క్ సంస్థలతో కలిసి పనిచేస్తున్నట్లు బీఎస్ఎన్ఎల్ వెల్లడించింది. ఈ ఫోన్‌లో అత్యవసర పరిస్థితుల కోసం ఎస్ఓఎస్ ఫీచర్‌ను కూడా అందించారు. ఒక్కసారి ఛార్జ్ చేస్తే ఎక్కువసేపు పనిచేసే బ్యాటరీ, కఠిన పరిస్థితులను తట్టుకునే బలమైన డిజైన్‌ను ఇందులో పొందుపరిచారు. అత్యవసర కమ్యూనికేషన్‌ను దృష్టిలో పెట్టుకొని దీన్ని రూపొందించారు. రక్షణ శాఖ, సముద్ర రవాణా, విపత్తు నిర్వహణ బృందాలు, గనుల పరిశ్రమ, మారుమూల ప్రాంతాల్లో పనిచేసే సంస్థలు, సాహస యాత్రికులు, దూర ప్రాంతాలకు వెళ్లే యాత్రికులను దృష్టిలో పెట్టుకొని ఈ ఫోన్‌ను రూపొందించినట్లు బీఎస్ఎన్ఎల్ తెలిపింది. సాధారణ వినియోగదారుల కోసం కాకుండా ప్రత్యేక అవసరాలున్న వారికి ఇది ఉపయోగపడుతుందని పేర్కొంది.

# 48 గంటల డెడ్‌లైన్

మొదటి పేజీ తరువాయి

అవుతున్న విద్యుత్‌పై తమకే హక్కులు కల్పించాలని, అలాగే రాజకీయ నాయకులు, ఉన్నతాధికారులకు కల్పిస్తున్న ప్రత్యేక సౌకర్యాలను రద్దు చేయాలని కమిటీ డిమాండ్ చేస్తోంది. గత కొన్ని వారాలుగా పీఓకేలో బంద్‌లు, ధర్నాలతో నిరసనలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వం నిరసనకారులపై ఉక్కుపాదం మోపుతూ పలువురిని అరెస్ట్ చేసిందని జేఏఏసీ నేతలు ఆరోపిస్తున్నారు. దీనివల్ల ఆహారం, మందుల కొరత ఏర్పడిందని, తక్షణమే మానవతా సాయం అందించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. పాకిస్థాన్ ఈ ప్రాంతాన్ని 'ఆజాద్ కశ్మీర్' అని పిలుస్తున్నప్పటికీ, ఇక్కడి సహజ వనరులను వాడుకుంటూ తమను ఆర్థికంగా అణచివేస్తోందని పీవోకే ప్రజలు ఆరోపిస్తున్నారు.

# శాంతించండి

జరిపారు. ఈ పర్యటనలో భాగంగా భారత్‌కు యురేనియం సరఫరా చేసేందుకు ఆస్ట్రేలియా అంగీకరించిందని, ఇరు దేశాలు ఈ మేరకు కీలకమైన అణుశక్తి ఒప్పందంపై సంతకాలు చేశాయని మోదీ ప్రకటించారు. స్వచ్ఛమైన ఇంధన లక్ష్యాలను సాధించడంలో ఈ ఒప్పందం కీలక పాత్ర పోషించనుంది. దీనితో పాటు, భారత్-ఆస్ట్రేలియా మధ్య ఒక 'క్రిటికల్ మినరల్స్ కారిడార్' (కీలక ఖనిజాల కారిడార్) 'డిఫెన్స్ ఇన్నోవేషన్ కారిడార్' ఏర్పాటు చేయనున్నట్లు ప్రధాని పేర్కొన్నారు.



# మూసీకి రూ.7,345 కోట్ల

## మూసీ పునరుజ్జీవనానికి తొలి అడుగు

# పరిపాలన అనుమతులు

హైదరాబాద్, జూలై 9 (ఈవార్తలు): హైదరాబాద్ నగరాన్ని అంతర్జాతీయ నగరాల సరసన నిలిపేందుకు తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టులో కీలక ముందడుగు పడింది. ఈ మెగా ప్రాజెక్టు పరిధిలోని ప్రాధాన్యతా ప్రాంతాల అభివృద్ధి కోసం రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ రూ.7,345.12 కోట్ల భారీ బడ్జెట్‌కు పరిపాలనా అనుమతులు మంజూరు చేస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో సుదీర్ఘ కాలంగా ప్రతిపాదనల దశలో ఉన్న మూసీ సుందరీకరణ, పునరుజ్జీవన పనులు త్వరలోనే క్షేత్రస్థాయిలో వేగవంతం కానున్నాయి. అయితే, ఈ కేటాయించిన నిధులలో కేవలం అభివృద్ధి పనుల వ్యయం మాత్రమే ఉందని భూసేకరణ ఖర్చులను ఇందులో చేర్చలేదని అధికారులు స్పష్టం చేశారు. భూసేకరణకు సంబంధించిన నిధులను ప్రభుత్వం విడిగా కేటాయించనుంది. ఈ భారీ ప్రాజెక్టు మొదటి విడతలో భాగంగా జోన్-1ఏ, జోన్-1బీ పరిధిలోని ప్రాంతాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దనున్నారు. జోన్-1ఏ కింద హిమాయత్‌సాగర్ నుంచి బాపూఘాట్ వరకు ఉన్న నదీ తీరాన్ని, అలాగే జోన్-1బీ కింద ఉస్మాన్‌సాగర్ నుంచి బాపూఘాట్ వరకు ఉన్న పరివాహక ప్రాంతాలను అనుసంధానిస్తూ అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. నదిలోకి మురుగునీరు చేరకుండా అడ్డుకట్ట వేయడం, నదీ తీరాల వెంబడి పచ్చదనం పెంపొందించడం, పర్యాటక ప్రాంతాలుగా మలచడం, అవసరమైన మౌలిక వసతుల కల్పన ఈ పనుల్లో ప్రధాన భాగం కానున్నాయి. హైదరాబాదీయులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించడమే లక్ష్యంగా ఈ జోన్లను ముస్తాబు చేయనున్నారు. ఈ మెగా ప్రాజెక్టుకు అవసరమయ్యే భారీ ఆర్థిక వనరులను సమకూర్చుకునేందుకు ప్రభుత్వం వ్యూహాత్మకంగా అడుగులు వేసింది. మొత్తం రూ.7,345.12 కోట్ల అంచనా వ్యయంలో సింహభాగాన్ని అంతర్జాతీయ సంస్థల నుంచి సేకరిస్తోంది. దీని కోసం ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ నుంచి రూ.4,500 కోట్ల భారీ రుణాన్ని తీసుకోనున్నారు. ఈ మేరకు సంప్రదింపులు తుది దశకు చేరాయి. ఇక మిగిలిన రూ.2,845.12 కోట్ల నిధులను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వమే బడ్జెట్ నుంచి గ్రాంట్ రూపంలో స్వయంగా భరించనుంది. ఈ నిధుల సమీకరణతో ప్రాజెక్టుకు ఎలాంటి ఆర్థిక అడ్డంకులు లేకుండా పనులు సాఫీగా సాగడానికి మార్గం సుగమమైంది.







## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.


## బీఆర్ఎస్ రాజ్యసభ ఫ్లోర్ లీడర్‌గా వద్దిరాజు



హైదరాబాద్, జూలై 9 (ఈవార్తలు): రాజ్యసభలో బీఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్‌గా ఉన్న సురేశ్ రెడ్డి పదవీకాలం ముగియడంతో, ఆయన స్థానంలో ప్రస్తుత డిప్యూటీ ఫ్లోర్ లీడర్, ఎంపీ వద్దిరాజు రవిచంద్రను ఫ్లోర్ లీడర్‌గా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నియమించారు. పార్టీ కోసం వద్దిరాజు చేసిన సేవలను గుర్తించి ఈ కీలక బాధ్యతలు అప్పగించారు. ఈ నియామకం పట్ల తెలంగాణ మున్నూరు కాపు సంఘం నాయకులు పార్టీ అధినేత కేసీఆర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వద్దిరాజు రవిచంద్రకు ఈ ఉన్నత పదవి దక్కడం బీసీల ఎదుగుదలకు, తెలంగాణ హక్కుల సాధనకు ఎంతో కీలకంగా మారుతుందని మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు సర్దార్ పుటం పురుషోత్తం పటేల్ ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్రం నుంచి తెలంగాణ రాష్ట్రానికి రావలసిన రాజ్యాంగపరమైన నిధులు, హక్కుల సాధనలో వద్దిరాజు పార్లమెంట్‌లో మరింత సమర్థవంతంగా గళం విప్పుతారని మున్నూరు కాపు సమాజం ఆశాభావం వ్యక్తం చేసింది.

## మరి హరీశ్‌ను ఎందుకు తీసేశారు?

**మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కౌంటర్**

హైదరాబాద్, జూలై 9 (ఈవార్తలు): సాగునీటి రంగంపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా చేసిన విమర్శలపై రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఘాటుగా స్పందించారు. మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ... హరీశ్ రావుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇరిగేషన్‌లో హరీశ్ రావు ఏదో పెద్ద నిష్ణాతుడైనట్లు మాట్లాడుతున్నారని మంత్రి ఉత్తమ్ ఎద్దేవా చేశారు. "హరీశ్ రావుకు అంత సత్తా ఉంటే, గత ప్రభుత్వంలో ఆయన మామ కేసీఆర్ ఆయనను ఆ శాఖ నుంచి ఎందుకు తొలగించారు? హరీశ్ రావు పనితీరుపై నమ్మకం లేకనే కేసీఆర్ ఆయనను రాత్రికి రాత్రే నీటి పారుదల శాఖ నుంచి తీసేశారు" అని ఉత్తమ్ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై బురదజల్లడమే లక్ష్యంగా హరీశ్ రావు ప్రెజెంటేషన్లు ఇస్తున్నారని, ఆయన చూపించిన అబద్ధపు గణాంకాలకు తాము వెనకడుగు వేసే ప్రసక్తే లేదన్నారు. హరీశ్ రావు చేసిన ప్రతి విమర్శకు సరైన సమయంలో, ఆధారాలతో సహా పూర్తి సమాధానం చెబుతామని మంత్రి స్పష్టం చేశారు.

## కారుణ్య మరణంపై కొత్త నిబంధనలు

అమరావతి,జూలై 9 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లో నిష్క్రియాత్మక కారుణ్య మరణం (ప్యాసివ్ యూథనేషియా) అమలుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కీలక మార్గదర్శకాలను జారీ చేసింది. కోలుకునే అవకాశం లేని వ్యాధులతో బాధపడుతున్న రోగులకు జీవనాధార వ్యవస్థలను ఉపసంహరించుకోవడానికి వీలు కల్పిస్తూ ఈ నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్య కుమార్ యాదవ్ జులై 8న ఈ విధివిధానాలకు అధికారికంగా ఆమోదం తెలిపారు. సుప్రీంకోర్టు నిర్దేశించిన 'గౌరవప్రదంగా మరణించే హక్కు'కు అనుగుణంగా ఈ నిబంధనలను రూపొందించారు. ప్యాసివ్ యూథనేషియా అంటే కోలుకోలేని స్థితిలో ఉన్న రోగులకు వెంటిలేటర్లు, ఫీడింగ్ ట్యూబ్‌లు వంటి కృత్రిమ వైద్య సహాయాన్ని నిలిపివేసి, వారు సహజంగా మరణించేందుకు అనుమతించడం. ఇది భారతదేశంలో నిషేధించబడిన 'యాక్టివ్ యూథనేషియా'కు భిన్నమైనది.

## బాలికపై అత్యాచారం..

ఏలూరు, జూలై 9 (ఈవార్తలు): పదకొండేళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడి, హత్యాయత్నం చేసిన కేసులో నిందితుడికి ఏలూరు ప్రత్యేక పోక్సో కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. నిందితుడు వడ్లమూడి బాలకృష్ణ (39)కు జీవిత ఖైదుతో పాటు రూ.35,000 జరిమానా విధిస్తూ బుధవారం ప్రత్యేక న్యాయమూర్తి కనుగుల వాణిశ్రీ తీర్పు వెలువరించారు. ఈ కేసు వివరాల్లోకి వెళితే.. 2015 అక్టోబర్ 21న ద్వారకా తిరుమల మండలంలోని ఓ గ్రామంలో ఈ దారుణ ఘటన చోటుచేసుకుంది. ప్రాసిక్యూషన్ కథనం మేరకు, నిందితుడు బాలకృష్ణ తొలుత బాలిక తల్లిదండ్రులపై ఇనుప రాడ్‌తో దాడికి పాల్పడ్డాడు. అనంతరం ఆ బాలికపై లైంగిక దాడికి ఒడిగట్టాడు. తన నేరం బయటపడకుండా, సాక్ష్యాలను నాశనం చేసే ఉద్దేశంతో బాలిక కాళ్లు, చేతులు కట్టేసి, ఇంట్లోని వంట గ్యాస్ లీక్ చేసి నిప్పంటించాడు.

## హైదరాబాద్‌లో వరంగల్ దంపతుల ఆత్మహత్య

**పొరుగువారు రూ.20 లక్షలు మోసం చేశారని ఆరోపణలు**

వరంగల్, జూలై 9 (ఈవార్తలు): ఆర్థిక వివాదాలు, మతం మారాలంటూ పొరుగువారి నుంచి ఎదురైన తీవ్ర ఒత్తిడి కారణంగా ఓ దంపతులు ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటన హైదరాబాద్‌లో చోటుచేసుకుంది. వరంగల్ జిల్లాకు చెందిన ఈ జంట, తమ ఇద్దరు చిన్నారులను అనాథలను చేస్తూ జూలై 2న ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కింద పడి ప్రాణాలు వదిలారు. క్రైస్తవ మతంలోకి మారాలని పొరుగువారు తమ తల్లిదండ్రులను బలవంతం చేశారని, ఆ వేధింపులే వారి ఆత్మహత్యకు దారితీశాయని వారి 14 ఏళ్ల కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేయడం సంచలనం సృష్టిస్తోంది. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం పాపయ్యపేటకు చెందిన రవికుమార్, శిరీష దంపతులు జీవనోపాధి కోసం హైదరాబాద్‌కు వలసు వచ్చి, హయత్‌నగర్ పరిధిలోని కుంట్లూరులో నివాసం ఉంటున్నారు. బియ్యం వ్యాపారం చేసే రవికుమార్‌కు పొరుగున ఉండే వెంకట్, ప్రమీలతో పరిచయం ఏర్పడింది. రెడీమిక్స్ కాంక్రీట్ వ్యాపారంలో పెట్టుబడి పెడితే నెలకు రూ.20,000 ఆదాయం వస్తుందని వారు నమ్మించారు. వారి మాటలు నమ్మిన రవికుమార్, తన భార్య బంగారు నగలను తాకట్టు పెట్టి సుమారు రూ.20 లక్షల వరకు వారికి అందజేశారు. అయితే, నిందితులు కేవలం రెండు మూడు నెలలు మాత్రమే నగదు చెల్లించి, ఆ తర్వాత నిలిపివేశారు. దీంతో అప్పులకు వడ్డీలు పెరిగిపోవడం, పెట్టిన పెట్టుబడి తిరిగి రాకపోవడంతో రవికుమార్ దంపతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయారు. ఇదే సమయంలో మతం మార్చుకోవాలంటూ వెంకట్, ప్రమీల తమపై ఒత్తిడి తెచ్చారని, చర్చికి రావాలని నిరంతరం వేధించేవారని వారి కుమారుడు సుశాంత్ పోలీసులకు తెలిపాడు. ఈ వేధింపులు భరించలేక వారు ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోవడానికి కూడా సిద్ధపడ్డారు. జూలై 2న ఆత్మహత్యకు పాల్పడకముందు రవికుమార్ దంపతులు వెంకట్‌తో ఫోన్‌లో మాట్లాడినట్లు కాల్ డేటా రికార్డులు ద్వారా స్పష్టమవుతోంది. ఘటనానంతరం పరారైన వెంకట్, ప్రమీలను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా, వారు తమపై వచ్చిన ఆరోపణలను తోసిపుచ్చారు. తొలుత అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన సికింద్రాబాద్ రైల్వే పోలీసులు, తదుపరి విచారణలో భాగంగా దానిని ఆత్మహత్యకు ప్రేరేపణ (సెక్షన్ 108) కింద మార్చి దర్యాప్తు చేపట్టారు. మత మార్పిడి ఆరోపణలపై ఇంకా పూర్తి స్పష్టత రాలేదని, అన్ని కోణాల్లో దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వెల్లడించారు. తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులను వరంగల్‌లోని బంధువుల వద్దకు చేర్చారు.

# కడియంది కపట బుద్ధి

**నా శాఖను హైజాక్ చేశారు**

**పీసీసీ చీఫ్‌కు కొండా సురేఖ ఫిర్యాదు**



వరంగల్/హైదరాబాద్, జూలై 9 (ఈవార్తలు): మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే కడియం శ్రీహరి మధ్య విభేదాలు మరింత తీవ్రమయ్యాయి. ఈ వ్యవహారంపై పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌ను కలిసిన సురేఖ తన అభ్యంతరాలను వివరించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయాలపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ కడియంపై చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. టీవీ9తో మాట్లాడుతూ.. తాను బాధ్యతలు చూస్తున్న దేవాదాయ శాఖలోకి తనకు సమాచారం ఇవ్వకుండా కడియం వచ్చి కమిషనర్‌తో సమీక్ష నిర్వహించారని సురేఖ ఆరోపించారు. ఏ పౌరుడైనా శాఖ కార్యాలయానికి వచ్చి వినతిపత్రం ఇవ్వొచ్చని, కానీ సమీక్షలు నిర్వహించడం మాత్రం తన శాఖను హైజాక్ చేసినట్టేనని వ్యాఖ్యానించారు. మంత్రి, ఎమ్మెల్యే బాధ్యతల మధ్య తేడా తెలుసుకోవాలని కడియానికి సూచించారు. ఈ సందర్భంగా కడియంపై సురేఖ వ్యక్తిగత విమర్శలు కూడా చేశారు. తాను సీనియర్‌నని, ఎన్నోసార్లు మంత్రిగా పనిచేశానని చెప్పుకుంటారని ఎద్దేవా చేశారు. గతంలో బీఆర్ఎస్ టికెట్‌పై పోటీ చేసి తర్వాత కాంగ్రెస్‌లో చేరిన వ్యక్తి ఇప్పుడు నీతి గురించి మాట్లాడటం సరికాదని విమర్శించారు. తాను కేవలం వినతిపత్రం మాత్రమే ఇచ్చానని, అపార్థం జరిగిందని కడియం చెప్పిన వివరణను కూడా సురేఖ ఖండించారు. సమీక్ష నిర్వహించి అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు కడియమే ప్రెస్‌నోట్ విడుదల చేశారని చెప్పారు. ఈ విషయాన్ని ఇప్పటికే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామని, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్‌కు కూడా వివరించినట్లు వెల్లడించారు. కడియం కపట బుద్ధితో వ్యవహరిస్తున్నారని సురేఖ ఆరోపించారు. ఎదుటివారి ఎదుగుదలను ఆయన సహించరని విమర్శించారు. గతంలో ఉప ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి ఇప్పుడు సాధారణ ఎమ్మెల్యేగా ఉండటం జీర్ణించుకోలేకపోతున్నారని అన్నారు. ఆయన కాంగ్రెస్‌లో చేరిన తర్వాతే గ్రూపు రాజకీయాలు పెరిగాయని ఆరోపించారు. మరోవైపు కడియం-సురేఖ వివాదాన్ని పరిష్కరిస్తామని మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. దీనిపై త్వరలోనే ఓ నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు.

## 22ఏ జాబితా నుంచి 2,074 ఎకరాల తొలగింపు

**బనగానపల్లెలో 101 ఎకరాల చుక్కల భూములకూ విముక్తి**

నంద్యాల, జూలై 9 (ఈవార్తలు): ఏపీలోని నంద్యాల జిల్లాలో దశాబ్దాలుగా నలుగుతున్న క్లిష్టమైన భూ సమస్యకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన పర్యటనలోనే తక్షణ పరిష్కారం చూపారు. బేతంచర్ల మండలం గుటుపల్లి గ్రామానికి చెందిన 897 మంది రైతుల 2,074 ఎకరాల భూములను నిషేధిత 22ఏ జాబితా నుంచి విముక్తి కల్పించారు. కేవలం హామీ ఇవ్వడమే కాకుండా, బనగానపల్లె తహసీల్దార్ కార్యాలయంలోనే అధికారుల సమక్షంలో మొత్తం ప్రక్రియను దగ్గరుండి పూర్తి చేయించి, రైతులకు విముక్తి పత్రాలను అందజేశారు. గురువారం నంద్యాల జిల్లాలో పర్యటించిన సీఎం, 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమంలో భాగంగా ఈ చారిత్రక నిర్ణయం తీసుకున్నారు. ఈ ఏడాది మార్చి 9న డోన్ పర్యటనలో గుటుపల్లి రైతులు తమ భూములను గత ప్రభుత్వం అన్యాయంగా 22ఏ జాబితాలో చేర్చిందని, దీంతో తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని చంద్రబాబుకు వినతిపత్రం ఇచ్చారు. ఆ వినతిని గుర్తుంచుకున్న ముఖ్యమంత్రి, గురువారం బనగానపల్లె పర్యటనలో ఆ రైతులను ప్రత్యేకంగా తహసీల్దార్ కార్యాలయానికి పిలిపించారు. సమస్య పరిష్కారానికి రాష్ట్రస్థాయిలో చర్యలు పూర్తయ్యాయని, జిల్లా స్థాయిలో ప్రక్రియ ఎంతవరకు వచ్చిందని జిల్లా రిజిస్ట్రార్‌ను ప్రశ్నించారు. కలెక్టర్ నుంచి అధికారిక ఉత్తర్వులు అందనందున ఆన్‌లైన్ ప్రక్రియ మొదలు కాలేదని రిజిస్ట్రార్ చెప్పడంతో, సీఎం అక్కడికక్కడే కలెక్టర్‌తో మాట్లాడి ఉత్తర్వులను రిజిస్ట్రార్‌కు అందజేశారు. "త్వరలోనే పూర్తి చేస్తాం" అని అధికారి చెప్పగా, "త్వరలో కాదు, ఇప్పుడే పూర్తి చేయండి" అని ముఖ్యమంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. దీంతో అధికారులు వెంటనే రంగంలోకి దిగి, గుటుపల్లికి చెందిన 2,074 ఎకరాలను 22ఏ జాబితా నుంచి ఆన్‌లైన్‌లో తొలగించారు. ఇదే స్ఫూర్తితో బనగానపల్లె పట్టణానికి చెందిన 23 మంది రైతుల 101 ఎకరాల చుక్కల భూములను కూడా నిషేధిత జాబితా నుంచి తప్పించారు.

యుద్ధం అనేది మానవ నాగరికతకు అతిపెద్ద శాపం. ప్రతి యుద్ధం వేలాది ప్రాణాలను బలి తీసుకోవడమే కాకుండా, కోట్లాది మంది జీవితాలను శాశ్వతంగా మార్చేస్తుంది. ఇళ్లు శిథిలాలుగా మారతాయి. ఆర్థిక వ్యవస్థలు కుప్పకూలుతాయి. పిల్లల భవిష్యత్తు చీకటిలో కలిసిపోతుంది. అందుకే ప్రపంచ దేశాలు యుద్ధం ప్రారంభమైన ప్రతిసారీ మొదట కోరేది "సీజ్ ఫైర్"నే. అంటే తాత్కాలికంగా అయినా కాల్పులను నిలిపివేయడం. శాంతి చర్చలకు మార్గం వేయడం. మానవతా సహాయం అందించేందుకు అవకాశం కల్పించడం. కానీ చరిత్రను పరిశీలిస్తే, "సీజ్ ఫైర్" అనే పదం చాలాసార్లు శాంతికి ప్రతీకగా కాకుండా, తదుపరి యుద్ధానికి విరామంగా మాత్రమే మారిపోయిన దాఖలాలు ఎక్కువగా కనిపిస్తాయి.

నేటి ప్రపంచ రాజకీయాల్లో పశ్చిమాసియా మరోసారి అగ్నిగుండంలా మారుతోంది. కాల్పుల విరమణ ప్రకటించినా, కొన్ని రోజులు గడవక ముందే పరస్పర ఆరోపణలు, క్షిపణి దాడులు, డ్రోన్ దాడులు, సముద్ర మార్గాలపై దాడులు మళ్లీ ప్రారంభమవు తున్నాయి. కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిందని ప్రపంచం ఊపిరి పీల్చుకునేలోపే మరోసారి పేలుళ్ల శబ్దాలు వినిపిస్తున్నాయి. దీనిని చూస్తుంటే ఒక ప్రశ్న తలెత్తు తోంది-సీజ్ ఫైర్ నిజంగా శాంతి కోసం జరుగుతోందా? లేక యుద్ధానికి మధ్యలో తీసుకునే వ్యూహాత్మక విరామమా? యుద్ధ చరిత్ర చెబుతున్న నిజం ఏమిటంటే, సీజ్ ఫైర్ అనేది శాశ్వత పరిష్కారం కాదు.

అది కేవలం ఒక అవకాశమే. ఆ అవకాశాన్ని శాంతి కోసం ఉపయోగించాలా, లేక మరింత పెద్ద దాడికి సిద్ధం కావడానికి ఉపయోగించాలా అనేది యుద్ధంలో పాల్గొనే దేశాల రాజకీయ సంకల్పంపై ఆధారపడి ఉంటుంది. దురదృష్టవశాత్తు, చాలా సందర్భాల్లో రెండో దారినే దేశాలు ఎంచుకున్నాయి. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఐక్యరాజ్యసమితి ఏర్పడిన ప్రధాన ఉద్దేశం ప్రపంచంలో యుద్ధాలను నివారించడం. వివాదాలను చర్చల ద్వారా పరిష్కరించడం. కానీ ఏడున్నర దశాబ్దాలకు పైగా గడిచినా, ప్రపంచం పూర్తిస్థాయి శాంతిని చూడలేకపోయింది. కొరియా ద్వీపకల్పం నుంచి కాశ్మీర్ వరకు, గాజా నుంచి ఉక్రెయిన్ వరకు, సిరియా నుంచి సూడాన్ వరకు ఎక్కడో ఒకచోట కాల్పులు కొనసాగుతూనే ఉన్నాయి. మధ్యలో సీజ్ ఫైర్ ఒప్పందాలు కుదిరినా, అవి ఎక్కువకాలం నిలవలేదు.



సిరియాలోని అలెప్పో నగరం దీనికి ప్రత్యక్ష ఉదాహరణ. కాల్పుల విరమణ ప్రకటించిన తర్వాత కూడా బాంబు దాడులు కొనసాగాయని అంతర్జాతీయ సంస్థలు అనేకసార్లు నివేదించాయి. వేలాది మంది పౌరులు మరణించారు. ఆసుపత్రులు, పాఠశాలలు ధ్వంసమయ్యాయి. ప్రపంచం చూస్తూ ఉండిపోయింది. సీజ్ ఫైర్ అనే పదం అక్కడ ప్రజలకు ఆశ కంటే నిరాశనే మిగిల్చింది. యెమెన్ పరిస్థితి కూడా భిన్నంగా లేదు. 2015 నుంచి కొనసాగుతున్న అంతర్యుద్ధంలో అనేకసార్లు కాల్పుల విరమణ ప్రకటించారు. ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో 2022లో అమల్లోకి వచ్చిన ఒప్పందం కొంతకాలం హింసను తగ్గించింది. అయినప్పటికీ స్థానిక స్థాయిలో ఘర్షణలు పూర్తిగా ఆగలేదు. సైనిక సమీకరణలు కొనసాగాయి. రాజకీయ పరిష్కారం లేకపోవడంతో శాంతి శాశ్వతంగా నిలబడలేదు. ఇరాన్-ఇరాక్ యుద్ధం (1980-1988) కూడా ప్రపంచ చరిత్రలో ఒక కీలక ఉదాహరణ. ఎనిమిదేళ్లపాటు సాగిన ఈ యుద్ధంలో లక్షలాది మంది ప్రాణాలు కోల్పోయారు. ఐక్యరాజ్యసమితి అనేకసార్లు కాల్పుల విరమణకు పిలుపునిచ్చినా, ఇరుపక్షాలు వెంటనే అంగీకరించలేదు. చివరకు 1988లో కాల్పుల విరమణ అమల్లోకి వచ్చినప్పటికీ, ఆ నిర్ణయం తీసుకునేలోపు అపారమైన ప్రాణనష్టం, ఆర్థిక నష్టం సంభవించింది. శాంతి ఆలస్యమైతే ఎంతటి మూల్యం చెల్లించాల్సి వస్తుందో ఈ యుద్ధం ప్రపంచానికి నేర్పింది.

# సీజ్ ఫైర్..

(స్పెషల్ స్టోరీ)

# ఒట్టు తీసి గట్టు మీద పెట్టు!

- దూడం శ్రీశైలం,
ఫ్రీలాన్స్ జర్నలిస్టు
ఫోన్ నంబర్:
9133947176



## దీనికి అనేక కారణాలున్నాయి.

మొదటిది పరస్పర అవిశ్వాసం. యుద్ధంలో ఉన్న రెండు దేశాలు ఒకదానిపై మరొకటి పూర్తిగా నమ్మకం కోల్పోతాయి. కాల్పులు ఆపితే ప్రత్యర్థి మరింత ఆయుధాలను సమకూర్చుకుంటాడనే అనుమానం ఉంటుంది. అందుకే అధికారికంగా సీజ్ ఫైర్ అమల్లో ఉన్నా, సరిహద్దుల వద్ద చిన్నచిన్న కాల్పులు, డ్రోన్ చొరబాట్లు, నిఘా చర్యలు కొనసాగుతూనే ఉంటాయి.

రెండో కారణం రాజకీయ ప్రయోజనాలు. చాలాసార్లు ప్రభుత్వాలు దేశీయ రాజకీయ ఒత్తిడిని దృష్టిలో పెట్టుకుని కఠిన వైఖరిని అవలంబిస్తాయి. శాంతి ఒప్పందానికి అంగీకరిస్తే బలహీనతగా భావిస్తారనే భయం నాయకుల్లో ఉంటుంది. ఫలితంగా సీజ్ ఫైర్‌పై సంతకం చేసినా, నేలమీద పరిస్థితి మారదు.

మూడో కారణం ఉగ్రవాద సంస్థలు లేదా ప్రభుత్వేతర సాయుధ గ్రూపులు. ప్రభుత్వం కాల్పుల విరమణకు అంగీకరించినా, ఆ దేశంలో పనిచేస్తున్న మిలీషియా సంస్థలు దానికి కట్టుబడి ఉండవు. ఒక చిన్న దాడి జరిగినా, ప్రత్యర్థి దేశం దానిని సీజ్ ఫైర్ ఉల్లంఘనగా పరిగణించి మళ్లీ యుద్ధాన్ని ప్రారంభిస్తుంది. ఈ విధంగా ఒక చిన్న సంఘటన పెద్ద యుద్ధానికి దారి తీస్తుంది.

నాలుగో కారణం మహాశక్తుల జోక్యం. ప్రపంచంలోని అనేక యుద్ధాలు కేవలం రెండు దేశాల మధ్య మాత్రమే ఉండవు. వాటి వెనుక ఆయుధాలు సరఫరా చేసే దేశాలు, వ్యూహాత్మక మద్దతు ఇచ్చే దేశాలు, ఆర్థిక ప్రయోజనాలు చూసే శక్తులు ఉంటాయి. అలాంటి పరిస్థితుల్లో శాంతి కంటే యుద్ధమే కొందరికి లాభదాయకంగా మారుతుంది. ఆయుధ పరిశ్రమలు, చమురు రాజకీయాలు, భౌగోళిక ఆధిపత్య పోటీ-ఇవన్నీ కలిసి సీజ్ ఫైర్‌ను బలహీనపరుస్తాయి.

మరో ముఖ్యమైన అంశం సీజ్ ఫైర్‌కు అమలు యంత్రాంగం లేకపోవడం. ఒప్పందంపై సంతకాలు చేయడం ఒక విషయం. దానిని కచ్చితంగా అమలు చేయించడం మరో విషయం. చాలా సందర్భాల్లో కాల్పుల విరమణను పర్యవేక్షించే అంతర్జాతీయ సంస్థలకు పరిమిత అధికారాలే ఉంటాయి. ఉల్లంఘన జరిగినా, వెంటనే శిక్షించే వ్యవస్థ లేదు. ఫలితంగా ఒప్పందం కాగితాలకే పరిమితమవుతుంది.

చరిత్రలో ఎన్నోసార్లు ఒకే దృశ్యం పునరావృతమైంది. మొదట కాల్పులు ఆగుతాయి. ప్రపంచ దేశాలు స్వాగతిస్తాయి. ఐక్యరాజ్యసమితి ప్రకటనలు చేస్తుంది. కొద్ది రోజులకు ఒక చిన్న సంఘటన జరుగుతుంది. ఇరుపక్షాలు ఒకదానిపై మరొకటి నిందలు వేస్తాయి. ఆ తర్వాత మళ్లీ యుద్ధం మొదలవుతుంది. ఈ చక్రం దశాబ్దాలుగా కొనసాగుతోంది.

## సీజ్ ఫైర్ ఎందుకు విఫలమవుతోంది?

## పశ్చిమాసియా చరిత్రలో చేదు నిజాలు

సీజ్ ఫైర్ అనగానే ప్రపంచ ప్రజల్లో ఆశలు చిగురిస్తాయి. కాల్పులు ఆగుతాయని, ప్రాణనష్టం తగ్గుతుందని, శాంతి చర్చలకు మార్గం సుగమమవుతుందని భావిస్తారు. కానీ పశ్చిమాసియా చరిత్రను పరిశీలిస్తే, కాల్పుల విరమణ ఒప్పందాలు శాశ్వత శాంతికి దారి తీసిన సందర్భాల కంటే, కొద్ది రోజుల విరామం తర్వాత మళ్లీ యుద్ధం చెలరేగిన సందర్భాలే ఎక్కువగా కనిపిస్తాయి. ఈ ప్రాంతంలో ప్రతి సీజ్ ఫైర్ వెనుక ఒక కొత్త యుద్ధం దాగి ఉందనే భావన అంతర్జాతీయ విశ్లేషకుల్లో బలపడింది. ప్రపంచంలో అత్యధికంగా సీజ్ ఫైర్ ఉల్లంఘనలకు వేదికగా నిలిచిన ప్రాంతం ఇజ్రాయెల్-పాలస్తీనా. 1948లో ఇజ్రాయెల్ ఏర్పడిన నాటి నుంచి ఈ ప్రాంతం పూర్తిస్థాయి శాంతిని చూసిన రోజులు చాలా తక్కువ. 1949లో మొదటి యుద్ధం అనంతరం ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో కాల్పుల విరమణ ఒప్పందాలు కుదిరాయి. కానీ అవి సరిహద్దు సమస్యలను పరిష్కరించలేకపోయాయి. కొద్ది కాలంలోనే సరిహద్దు ఘర్షణలు మళ్లీ మొదలయ్యాయి. 1967లో జరిగిన ఆరు రోజుల యుద్ధం తర్వాత కూడా సీజ్ ఫైర్ అమల్లోకి వచ్చింది. అయినప్పటికీ, గోలాన్ హైట్స్, వెస్ట్ బ్యాంక్, గాజా వంటి ప్రాంతాల్లో ఉద్రిక్తతలు కొనసాగాయి. 1973లో యోమ్ కిప్పూర్ యుద్ధం మళ్లీ చెలరేగింది. అంటే ఒక కాల్పుల విరమణ మరో యుద్ధాన్ని పూర్తిగా అడ్డుకోలేకపోయింది. గాజా ప్రపంచానికి మరో చేదు పాఠం నేర్పింది. 2008, 2012, 2014, 2021, 2023... ఇలా ప్రతి పెద్ద ఘర్షణ తర్వాత కాల్పుల విరమణ ప్రకటించబడింది. కానీ ప్రతి ఒప్పందం కొద్ది రోజులు లేదా కొద్ది నెలలకే పరిమితమైంది. ఒకవైపు రాకెట్ దాడులు, మరోవైపు వైమానిక దాడులు తిరిగి ప్రారంభమయ్యాయి. పరస్పరం ఒకరినొకరు సీజ్ ఫైర్ ఉల్లంఘించారని ఆరోపించుకోవడం ఈ ఘర్షణల్లో సర్వసాధారణంగా మారింది. ఇక్కడ ప్రధాన సమస్య ఏమిటంటే, యుద్ధం కేవలం రెండు ప్రభుత్వాల మధ్య మాత్రమే జరగడం లేదు. ప్రభుత్వ సైన్యాలతో పాటు హమాస్, ఇస్లామిక్ జిహాద్ వంటి సాయుధ సంస్థలు కూడా రంగంలో ఉండటం వల్ల ఒప్పందాల అమలు మరింత క్లిష్టమవుతోంది. ఒక చిన్న రాకెట్ దాడి జరిగినా, దానికి ప్రతీకారంగా భారీ వైమానిక దాడులు ప్రారంభమవుతున్నాయి. చివరకు సీజ్ ఫైర్ కూలిపోతుంది. లెబనాన్ కూడా ఇలాంటి అనుభవాలనే ఎదుర్కొంది. 2006లో ఇజ్రాయెల్-హెజ్బొల్లా యుద్ధం ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. ఐక్యరాజ్యసమితి తీర్మానం 1701 ద్వారా కాల్పుల విరమణ అమల్లోకి వచ్చింది. దక్షిణ లెబనాన్‌లో అంతర్జాతీయ శాంతి బలగాలు మోహరించబడ్డాయి. అయినప్పటికీ సరిహద్దు వద్ద ఉద్రిక్తతలు పూర్తిగా ఆగలేదు. అప్పుడప్పుడు క్షిపణి దాడులు, డ్రోన్ దాడులు, సరిహద్దు కాల్పులు కొనసాగుతూనే ఉన్నాయి. అంటే అంతర్జాతీయ పర్యవేక్షణ ఉన్నప్పటికీ సీజ్ ఫైర్‌ను శాశ్వతంగా నిలబెట్టడం సాధ్యం కాలేదు. సిరియా పరిస్థితి మరింత సంక్లిష్టంగా ఉంది. 2011లో అంతర్యుద్ధం ప్రారంభమైన తర్వాత అనేకసార్లు కాల్పుల విరమణ ఒప్పందాలు కుదిరాయి. రష్యా, అమెరికా, టర్కీ, ఐక్యరాజ్యసమితి మధ్యవర్తిత్వంతో పలు ఒప్పందాలు జరిగాయి. కానీ ప్రతి ఒప్పందం కొద్ది రోజులకే విఫలమైంది. కారణం ఒక్కటే కాదు. ప్రభుత్వ బలగాలు, తిరుగుబాటు దళాలు, ఉగ్రవాద సంస్థలు, విదేశీ సైన్యాలు-అందరూ ఒకే యుద్ధరంగంలో ఉండటం వల్ల ఒకరి చర్యలకు మరొకరు బాధ్యత వహించలేదు. ఫలితంగా ప్రతి సీజ్ ఫైర్ చివరకు విఫలమైంది.

## ప్రపంచానికి పాఠాలు

పశ్చిమాసియాలోనే కాదు, ప్రపంచంలోని దాదాపు ప్రతి ప్రధాన ఘర్షణలోనూ ఒకే దృశ్యం కనిపిస్తుంది. ముందుగా కాల్పుల విరమణ ప్రకటిస్తారు. ప్రపంచ దేశాలు స్వాగతిస్తాయి. కొంతకాలం ప్రశాంతత నెలకొంటుంది. కానీ ఆ తర్వాత సరిహద్దుల్లో కాల్పులు, క్షిపణి దాడులు, డ్రోన్ దాడులు, చొరబాట్లు, పరస్పర ఆరోపణలు మొదలవుతాయి. చివరకు సీజ్ ఫైర్ కూలిపోతుంది. ఈ దుష్చక్రం దశాబ్దాలుగా కొనసాగుతూనే ఉంది. సీజ్ ఫైర్ ఉల్లంఘనల గురించి మాట్లాడితే భారతదేశానికి అత్యంత దగ్గర ఉదాహరణ భారత్-పాకిస్థాన్. 1947 విభజన తర్వాత కాశ్మీర్ సమస్యపై అనేక యుద్ధాలు జరిగాయి. 1949లో ఐక్యరాజ్యసమితి మధ్యవర్తిత్వంతో కాల్పుల విరమణ అమల్లోకి వచ్చింది. ఆ తర్వాత నియంత్రణ రేఖ ఏర్పడింది. అయినప్పటికీ కాల్పులు పూర్తిగా ఆగలేదు. దశాబ్దాల పాటు సరిహద్దుల్లో కాల్పులు, చొరబాట్లు, సైనిక ఘర్షణలు కొనసాగుతూనే వచ్చాయి. 2003లో భారత్-పాకిస్థాన్ మరోసారి కాల్పుల విరమణ ఒప్పందానికి అంగీకరించాయి. ప్రారంభంలో కొంత ప్రశాంతత కనిపించినా, తర్వాతి సంవత్సరాల్లో అనేకసార్లు కాల్పుల విరమణ ఉల్లంఘనలు చోటుచేసుకున్నాయి. ఇరుదేశాలు ఒకరినొకరు నిందించుకున్నాయి. సరిహద్దు గ్రామాల్లో నివసించే ప్రజలు నిరంతరం భయాందోళనల మధ్య జీవించారు. వ్యవసాయం దెబ్బతింది. విద్యార్థుల చదువులు అంతరాయం కలిగాయి. సీజ్ ఫైర్ కాగితంపై ఉండగా, నేలమీద మాత్రం తుపాకుల శబ్దం వినిపిస్తూనే ఉంది. 2021లో రెండు దేశాలు మళ్లీ కాల్పుల విరమణను పునరుద్ధాటించాయి. దీంతో సరిహద్దు ప్రాంతాల్లో హింస గణనీయంగా తగ్గింది. ఇది ఒక ముఖ్యమైన పాఠాన్ని చెబుతోంది. రాజకీయ సంకల్పం బలంగా ఉంటే సీజ్ ఫైర్ విజయవంతమవుతుంది. అయితే శాంతిని కొనసాగించాలంటే మూల సమస్యల పరిష్కారం కూడా అంతే అవసరం. ఇప్పుడు ప్రపంచ దృష్టి ఎక్కువగా ఉన్న ఘర్షణ రష్యా-ఉక్రెయిన్ యుద్ధం. 2014లో క్రిమియా సంక్షోభం తర్వాత తూర్పు ఉక్రెయిన్‌లో ఘర్షణలు ప్రారంభమయ్యాయి. దీనిని ఆపేందుకు మిన్స్క్ ఒప్పందాలు కుదిరాయి. కాల్పుల విరమణ, భారీ ఆయుధాల ఉపసంహరణ, రాజకీయ పరిష్కారం వంటి అంశాలు అందులో ఉన్నాయి. కానీ నేలమీద పరిస్థితి భిన్నంగా సాగింది. ఇరుపక్షాలు ఒకరిపై ఒకరు ఉల్లంఘన ఆరోపణలు చేశాయి. చిన్నచిన్న ఘర్షణలు కొనసాగాయి. చివరకు 2022లో పూర్తి స్థాయి యుద్ధం ప్రారంభమైంది. అంటే సీజ్ ఫైర్ అమలు కాకపోతే అది భవిష్యత్తులో మరింత పెద్ద యుద్ధానికి దారితీసే ప్రమాదం ఉందని ఈ ఉదాహరణ స్పష్టం చేసింది. కొరియా ద్వీపకల్పం మరో ఆసక్తికర ఉదాహరణ. 1953లో కొరియా యుద్ధం ముగిసినప్పుడు శాంతి ఒప్పందం కాదు, ఆర్మిస్టిస్ మాత్రమే కుదిరింది. అంటే యుద్ధం అధికారికంగా ముగియలేదు; కాల్పులు మాత్రమే ఆగాయి. అప్పటి నుంచి ఉత్తర కొరియా-దక్షిణ కొరియా మధ్య అప్పుడప్పుడు సరిహద్దు ఉద్రిక్తతలు, క్షిపణి పరీక్షలు, సముద్ర ఘర్షణలు జరుగుతూనే ఉన్నాయి. ఏడు దశాబ్దాలు గడిచినా శాశ్వత శాంతి ఒప్పందం కుదరలేదు. కాల్పుల విరమణ ఒక్కటే సరిపోదని ఈ ఉదాహరణ ప్రపంచానికి గుర్తు చేస్తోంది. నాగోర్నో-కరాబాఖ్ ప్రాంతంలో అర్మేనియా-అజర్‌బైజాన్ మధ్య కూడా ఇదే పరిస్థితి కనిపించింది. 1994లో కాల్పుల విరమణ కుదిరినా, సరిహద్దు ఘర్షణలు పూర్తిగా ఆగలేదు. 2016లో నాలుగు రోజుల యుద్ధం జరిగింది. 2020లో భారీ యుద్ధం చెలరేగింది. అనంతరం రష్యా మధ్యవర్తిత్వంతో మరోసారి కాల్పుల విరమణ అమల్లోకి వచ్చినా, ఉద్రిక్తతలు కొనసాగుతూనే ఉన్నాయి. చివరకు ప్రాంతీయ రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారిపోయాయి. శాంతి కోసం కుదిరిన ఒప్పందం, దీర్ఘకాలిక పరిష్కారం లేకపోతే ఎంత బలహీనంగా ఉంటుందో ఈ సంఘటన తెలియజేస్తుంది.



# కాంగ్రెస్ ఖేల్ ఖతం

## ఇప్పటికిప్పుడు ఎన్నికలు పెడితే బీఆర్ఎస్‌కు 78 సీట్లు

### రేవంత్ సొంత సర్వేలోనే తేటతెల్లం.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్, జూలై 9(ఈవార్తలు): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పతనం ఖాయమైందని, ఇప్పటికిప్పుడు ఎన్నికలు పెడితే బీఆర్ఎస్సే ప్రభుత్వాన్ని ఏర్పాటుచేస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి సొంత సర్వేలోనే తేలిందని బీఆర్ఎస్ వరింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ సర్కార్ సగం పదవీకాలం ముగిసిన నేపథ్యంలో రేవంత్‌రెడ్డి తన నాయకత్వం, పరిపాలనపై ఒక విస్తృత సర్వే చేయించుకున్నా రని, అందులో ప్రభుత్వంపై తీవ్ర ప్రజా వ్యతిరేకత వ్యక్తమైందని తెలిపారు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే బీఆర్ఎస్ సుమారు 78 సీట్లతో మళ్లీ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేస్తుందని ఆ సర్వే తేల్చిందని వెల్లడించారు. రెండు మీడియా సంస్థలు, కేంద్ర, రాష్ట్ర ఇంటెలిజెన్స్ విభాగాలు చేసిన ప్రజాభిప్రాయ సేకరణలోనూ ఇదే అంశం వెల్లడైందని, ప్రజలు మరోసారి కేసీఆర్‌ను ముఖ్యమంత్రిగా చూడాలను కుంటున్నారని చెప్పారు. తన సొంత సర్వేతోపాటు పలు సర్వేల్లో వ్యక్తమైన ప్రజావ్యతిరేకతను చూసి తట్టుకోలేకనే ముఖ్యమంత్రి వారం రోజులుగా అడ్డగోలుగా మాట్లాడుతున్నారని కేటీఆర్ విమర్శించారు. తన పరిపాలనా వైఫల్యాలను కప్పిపుచ్చుకొనేందుకు అనేక అటెన్షన్ డైవర్షన్ పనులు చేస్తున్నారని, అందులో భాగంగానే కాళేశ్వరం మొదలు రైతుబంధు దాకా అన్నింటిపైనా అడ్డగోలుగా అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ నివాసంలో జీహెచ్ఎంసీ పరిధిలోని పార్టీ ప్రజాప్రతినిధులు, ముఖ్యనేతలతో గురువారం ప్రత్యేక సమీక్ష సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. ప్రజలు కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా బీఆర్ఎస్ వైపే చూస్తున్నారని, బీజేపీకి అవకాశం ఇచ్చే ప్రసక్తే లేదని స్పష్టంచేశారు. కాంగ్రెస్ పతనం దాదాపు ఖా యమైపోయిందని, జారుడుబండపైన ఉన్న ఆ పార్టీ ఇక పుంజుకొనే అవకాశమే లేదని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా సాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ(సర్) కార్యక్రమంపై బీఆర్ఎస్ శ్రేణులు ప్రత్యేక దృష్టి సారించాలని కేటీఆర్ దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం, ఎన్నికల సంఘం నియమించిన బీఎల్‌వోలకు సరైన శిక్షణ, వసతులు లేక ఈ ప్రక్రియ అత్యంత మందకొడిగా సాగుతున్నదని, దీనివల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా హైదరాబాద్ మహానగరంలో ఎన్యుమరేషన్ పత్రాల పంపిణీ, వాటిలో ఓటర్ల నమోదు అంశాలపై సరైన అవగాహన లేకుండానే కేటాయించారని కిందిస్థాయి నుంచి పార్టీ వర్గాలు చెప్తున్నారని పేర్కొన్నారు. గతంలో జూబ్లీహిల్స్ ఉపఎన్నిక సమయంలో భారీగా దొంగ ఓట్లు, డబుల్ ఓట్లు బయటపడిన విషయాన్ని కేటీఆర్ గుర్తుచేశారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్, బీజేపీలు దొంగ ఓట్లను చేర్చేందుకు, బీఆర్ఎస్ మద్దతుదారుల ఓట్లను తొలగించేందుకు ప్రయత్నించే ప్రమాదం ఉన్నని హెచ్చరించారు. 'ఒక వ్యక్తికి ఒకే ఓటు' అనే రాజ్యాంగ స్ఫూర్తితో దొంగ ఓట్లు లేకుండా చూడాల్సిన బాధ్యత మనపై ఉన్నదని సూచించారు. హైదరాబాద్ పరిధిలోని స్థానిక ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జులు బూత్ లెవల్ ఏజెంట్లు(బీఎల్ఏ) సమన్వయంతో ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలను పార్టీ తరఫున ఎప్పటికప్పుడు ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్తున్నట్టు చెప్పారు. సమావేశంలో హైదరాబాద్ జీహెచ్ఎంసీ పరిధికి చెందిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, నియోజకవర్గ ఇన్‌చార్జులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# కన్నెపల్లి పంపులు ఆన్ చేయండి

**మేడిగడ్డ బరాజ్‌కు నష్టం లేదు**

**నదీ జలాలను భేషుగ్గా ఎత్తిపోసుకోవచ్చు**

**రైతులను కాపాడాలి: విశ్రాంత ఇంజనీర్లు**


తెలంగాణ విశ్రాంత ఇంజనీర్ల సంఘం
Telangana Retired Engineers' Association (TREA)
President Er M.Shyamprasad Reddy | General Secretary Er. Tanneeru Venkatesham | Secretary Finance Er. A. Madan Mohan
ప్రెస్ నోట్

హైదరాబాద్, జూలై 9 (ఈవార్తలు): ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కన్నెపల్లి, అన్నారం, సుందిళ్ల పంపింగ్ స్టేషన్లను తక్షణమే ప్రారంభించాలని తెలంగాణ విశ్రాంత ఇంజినీర్ల సంఘం ప్రభుత్వాన్ని కోరింది. మినిమమ్ డ్రా డౌన్ లెవల్ మేరకు బరాజ్‌లలో నీటిని నిల్వ చేసి సురక్షితంగా పంపింగ్ చేపట్టవచ్చని సంఘం స్పష్టం చేసింది. ఈ మేరకు సంఘం గౌరవాధ్యక్షుడు జీ. దామోదర్ రెడ్డి, అధ్యక్షుడు ఎం. శ్యామ్ ప్రసాద్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి తన్నీరు వెంకటేశం, అసోసియేట్ అధ్యక్షుడు డీ. సాంబయ్య సంయుక్త ప్రకటన విడుదల చేశారు. వారు మాట్లాడుతూ, కేంద్ర జల సంఘం తాజా నివేదిక ప్రకారం రాష్ట్రంలోని ప్రధాన జలాశయాల్లో నీటి నిల్వలు సాధారణ స్థాయి కంటే 16 నుంచి 46 శాతం వరకు తక్కువగా ఉన్నాయని తెలిపారు. అయితే ప్రాణహిత నదిలో ప్రస్తుతం వినియోగానికి అనువైన వరద ప్రవాహాలు అందుబాటులో ఉన్నాయని, ఈ పరిస్థితిని సద్వినియోగం చేసుకుని కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల లిఫ్టులను సురక్షితంగా వినియోగించవచ్చని అభిప్రాయపడ్డారు. మేడిగడ్డ వద్ద ప్రస్తుతం ప్రాణహిత నీటిమట్టం కనిష్ఠ డ్రా డౌన్ స్థాయి కంటే ఎత్తులో ఉండటంతో కన్నెపల్లి పంప్‌హౌస్‌కు అవసరమైన హెడ్ అందుబాటులో ఉందని తెలిపారు. ఈ పంప్‌హౌస్ రోజుకు సుమారు మూడు టీఎంసీల నీటిని ఎత్తిపోసే సామర్థ్యం కలిగి ఉందని వివరించారు. అన్నారం, సుందిళ్ల బరాజ్‌లను కనిష్ఠ డ్రా డౌన్ స్థాయిల వద్ద నిర్వహిస్తే అవి పూర్తిగా సురక్షిత పరిధిలోనే ఉంటాయని పేర్కొన్నారు. ఈ రెండు జలాశయాల్లో కలిపి సుమారు 8.8 టీఎంసీల నీటిని నిల్వ చేయవచ్చని, ఒకవేళ అత్యవసర పరిస్థితులు తలెత్తినా గత వరదల అనుభవాల ప్రకారం గ్రామాల ముంపు, ఆస్తి నష్టం లేదా ప్రాణనష్టం సంభవించే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయని తెలిపారు. ప్రాణహితలో వరద నీటిమట్టం మేడిగడ్డ ఎండీడీఎల్ కంటే ఎత్తులో ఉన్నంతకాలం మేడిగడ్డ నుంచి కన్నెపల్లి ద్వారా నీటిని ఎత్తిపోసి, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లను ఎండీడీఎల్ స్థాయిల్లో నిర్వహిస్తూ ఎల్లంపల్లి వరకు నీటిని తరలించడం సాంకేతికంగా సాధ్యమని వివరించారు. ఎల్‌నినో పరిస్థితుల దృష్ట్యా రైతుల పంటలను కాపాడేందుకు ప్రభుత్వం వెంటనే మూడు పంపింగ్ స్టేషన్లను ఆపరేషన్‌లోకి తీసుకురావాలని విశ్రాంత ఇంజినీర్ల సంఘం విజ్ఞప్తి చేసింది. అవసరమైతే ఈ ప్రక్రియలో రాష్ట్ర రిటైర్డ్ ఇంజినీర్ల అసోసియేషన్ తమ సాంకేతిక సేవలను స్వచ్ఛందంగా అందించడానికి సిద్ధంగా ఉందని వెల్లడించింది.



## హైడ్రా కమిషనర్‌తో రియల్‌వర్సిటీ ప్రతినిధుల భేటీ

హైదరాబాద్, జూలై 9 (ఈవార్తలు): రియల్ ఎస్టేట్ రంగంలో విద్య, నైపుణ్యాభివృద్ధి కోసం కృషి చేస్తున్న రియల్‌వర్సిటీ సంస్థ ప్రతినిధులు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. గత నెల 30న నిర్వహించిన రియల్‌వర్సిటీ - రియల్టర్స్ గ్రోత్ కాన్‌క్లేవ్-2026 కార్యక్రమానికి.. సీఎం మీటింగ్ నేపథ్యంలో హైడ్రా కమిషనర్ హాజరు కాలేకపోయారు. ఈ నేపథ్యంలో రియల్‌వర్సిటీ వ్యవస్థాపకుడు ఉరుకుందు శెట్టి నేతృత్వంలోని ప్రతినిధి బృందం కమిషనర్ కార్యాలయంలో ఆయనను కలిసి, కార్యక్రమ జ్ఞాపికతో పాటు సన్మాన పత్రాన్ని అందజేసింది. ఈ సందర్భంగా రంగనాథ్ మాట్లాడుతూ, రియల్ ఎస్టేట్ రంగంలో అవగాహన, వృత్తి నైపుణ్యాల పెంపు, పరిశ్రమ అభివృద్ధికి రియల్‌వర్సిటీ చేపడుతున్న కార్యక్రమాలను అభినందించారు. భవిష్యత్తులో సంస్థ నిర్వహించే కార్యక్రమాలకు తప్పకుండా హాజరవుతానని హామీ ఇచ్చారు. కమిషనర్ అందించిన ప్రోత్సాహం, ఆశీస్సులు తమ సంస్థకు మరింత ఉత్సాహాన్ని కలిగిస్తాయని రియల్‌వర్సిటీ ప్రతినిధులు తెలిపారు. రంగనాథ్‌ను కలిసినవారిలో ఉరుకుందు శెట్టితోపాటు కోర్ టీం సభ్యుడు సురేశ్ కుమార్ హాజరయ్యారు.

# అంగన్‌వాడీ భవనం ఆక్రమణ తొలగించాలి

**ప్రభుత్వ ఆస్తికి రక్షణ కల్పించాలి**

**నరసింహులపల్లె అంగన్‌వాడీ ఆక్రమణపై చర్యలేవీ?**

**అధికారులకు మాజీ మంత్రి జీవన్‌రెడ్డి వినతి**




బీర్పూర్, జూలై 9 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండలం నరసింహులపల్లె గ్రామంలోని ప్రభుత్వ అంగన్‌వాడీ భవనం ఆక్రమణను వెంటనే తొలగించి ప్రభుత్వ ఆస్తిని పరిరక్షించాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు. గ్రామస్థులు, పార్టీ నాయకులతో కలిసి గురువారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలోని సర్వే నంబర్--22, హౌస్ నంబర్--3-96 ప్రభుత్వ అంగన్‌వాడీ భవనమని రెవెన్యూ అధికారులు నిర్ధారించారని తెలిపారు. ఎమ్మార్వో నివేదికలో కూడా ప్రభుత్వ ఆస్తి ఆక్రమణకు గురైనట్లు పేర్కొన్నారని అన్నారు. ప్రజావాణిలో గ్రామస్థులు చేసిన ఫిర్యాదుపై జిల్లా కలెక్టర్ స్పందించి సంబంధిత అధికారులకు ఆక్రమణ తొలగించాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. డీపీఓ శిక్షణలో ఉండటంతో ఎంపీడీఓను పంపించినట్లు పేర్కొంటూ, అధికారులు ఆలస్యం చేయకుండా చట్టబద్ధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించడం అధికారుల బాధ్యత అని, సమస్యను శాంతియుతంగా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. జాప్యం కొనసాగితే గ్రామస్థుల ఆందోళనలు తీవ్రరూపం దాల్చే అవకాశం ఉందని హెచ్చరించారు. ఇటీవల గ్రామంలో జరిగిన నిరసన సందర్భంగా పోలీసులు లాఠీచార్జ్ చేయడం బాధాకరమని జీవన్‌రెడ్డి విమర్శించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ అంటే ప్రజలకు అండగా నిలవడమే తప్ప, ప్రభుత్వ ఆస్తులను కాపాడాలని కోరుతున్న వారిపై చర్యలు తీసుకోవడం కాదన్నారు. గోడ కూల్చివేత ఘటనలో స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్‌ను చట్ట ప్రకారం కోర్టుకు అప్పగించకుండా పోలీస్ స్టేషన్‌లో ఉంచడం సరికాదన్నారు. రైతు జీవనాధారమైన ట్రాక్టర్‌ను యజమానికి లేదా కోర్టు ఆదేశాల మేరకు అప్పగించాలని డిమాండ్ చేశారు. అధికారులు పారదర్శకంగా, చట్టబద్ధంగా వ్యవహరించి నరసింహులపల్లె అంగన్‌వాడీ భవనం ఆక్రమణ సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని వినతిపత్రంలో కోరారు.

## పట్టా భూమి వివాదంలో న్యాయం చేయాలంటూ మహిళ ఆందోళన

**పురుగుల మందు డబ్బాతో కలెక్టరేట్‌కు.. అప్రమత్తమైన పోలీసులు**



జగిత్యాల, జూలై 9 (ఈవార్తలు): భూ వివాదంలో న్యాయం చేయాలని కోరుతూ బెజ్జంకి నిహారిక అనే మహిళ పురుగుల మందు డబ్బాతో జగిత్యాల కలెక్టరేట్‌కు చేరుకుని ఆందోళనకు దిగింది. ముందుగా అధికారులకు వినతిపత్రం అందజేసిన ఆమె అనంతరం కలెక్టరేట్ ప్రాంగణంలో కూర్చొని నిరసన తెలిపింది. తన తండ్రి నుంచి పసుపు కుంకుమ కింద వెల్దుర్తి గ్రామంలో 30 గుంటల భూమి తనకు సంక్రమించిందని నిహారిక తెలిపారు. ఆ భూమిని చదును చేసి సాగు చేసుకునేందుకు ప్రయత్నించగా గ్రామ సర్పంచ్ భర్త అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ట్రాక్టర్లను అడ్డుకోవడంతో పాటు పనులకు వచ్చిన వారిని బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టా భూమిలో సాగుకు అడ్డుకోవడం సరికాదని, పలుమార్లు సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం లభించకపోవడంతోనే పురుగుల మందు డబ్బాతో కలెక్టరేట్‌కు వచ్చినట్లు ఆమె పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న టౌన్ పోలీసులు వెంటనే స్పందించి ఆమె చేతిలోని పురుగుల మందు డబ్బాను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం మహిళను సముదాయించి, సమస్యపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆమె అక్కడి నుంచి వెళ్లిపోయారు.

### ఉద్యోగ అవకాశాలపై విద్యార్థులకు

# ఎమ్మెల్యే సంజయ్ అవగాహన



కోరుట్ల/హైదరాబాద్, జూలై 9 (ఈవార్తలు): గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు ప్రపంచ స్థాయి అవకాశాలపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా మెట్‌పల్లి, కోరుట్ల డిగ్రీకళాశాలల విద్యార్థులను హైదరాబాద్‌లోని టీ-హబ్, టీ-వర్క్స్ సంస్థలకు విద్యా పర్యటనకు తీసుకెళ్లినట్లు కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిగ్రీ పూర్తి చేయడమే విజయానికి అంతిమ లక్ష్యం కాదని, ప్రపంచంతో పోటీ పడే స్థాయిలో నైపుణ్యాలను పెంపొందించుకుని సృజనాత్మక ఆలోచనలతో కొత్త అవకాశాలను సృష్టించుకోవాలని విద్యార్థులకు సూచించారు. విద్యే మనిషికి నిజమైన సంపద అని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన టీ-హబ్, టీ-వర్క్స్ వంటి సంస్థలు స్టార్టప్‌లు, ఆవిష్కరణలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, పారిశ్రామిక అవకాశాలు, మెంటరింగ్, పెట్టుబడుల కల్పన వంటి రంగాల్లో యువతకు విశేష సేవలందిస్తున్నాయని తెలిపారు. ఈ అవకాశాలను గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు సద్వినియోగం చేసుకుని తమ ప్రతిభను ప్రపంచానికి చాటాలని పిలుపునిచ్చారు. సందర్శనలో భాగంగా విద్యార్థులు స్టార్టప్‌ల ఏర్పాటు, అత్యాధునిక యంత్రాలు, ప్రోటోటైపింగ్ కేంద్రాలు, పరిశోధన సౌకర్యాలు, సాంకేతిక శిక్షణ, పారిశ్రామిక మార్గదర్శకత్వంపై ప్రత్యక్షంగా అవగాహన పొందారు. ఈ విద్యా పర్యటన తమలో ఆత్మవిశ్వాసాన్ని పెంచిందని, ఉద్యోగాల కోసం ఎదురుచూసే వారిగా కాకుండా ఉద్యోగాలు కల్పించే పారిశ్రామికవేత్తలుగా ఎదగాలనే సంకల్పాన్ని బలపరిచిందని విద్యార్థులు తెలిపారు. ఇలాంటి విద్యా, విజ్ఞాన, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను భవిష్యత్తులోనూ కొనసాగిస్తామని ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ పేర్కొన్నారు.

## భర్తను హత్య చేసిన భార్య అరెస్టు

**రోకలిబండతో దాడి.. కోరుట్లలో దారుణం**




కోరుట్ల/మెట్‌పల్లి, జూలై 9 (ఈవార్తలు): కుటుంబ కలహాల నేపథ్యంలో భర్తను రోకలిబండతో హత్య చేసిన భార్యను కోరుట్ల పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను మెట్పల్లి డీఎస్పీ ఏ. రాములు గురువారం కోరుట్ల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. అల్లమయ్యగుట్టకు చెందిన ఇప్ప కాశిరాం (35), భార్య రజినికి 14 ఏళ్ల క్రితం వివాహమైంది. వారికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. మద్యం సేవించడం, తరచూ భార్యపై దాడులు చేయడం, పిల్లలను వేధించడం వల్ల విసిగిపోయిన రజిని భర్తను హత్య చేయాలని నిర్ణయించుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. సుమారు 20 రోజుల క్రితం కూడా కర్రతో దాడి చేయగా స్థానికులు అడ్డుకుని కాశిరాంను రక్షించినట్లు చెప్పారు. ఈ నెల 8వ తేదీ రాత్రి మద్యం సేవించి ఇంటికి వచ్చిన కాశిరాంతో రజిని ఉద్దేశపూర్వకంగా గొడవపడి, రాత్రి సుమారు 11.45 గంటల సమయంలో ఇంట్లో ఉన్న రోకలిబండతో తలపై, శరీరంపై బలంగా దాడి చేసింది. తీవ్ర గాయాలతో కాశిరాం అక్కడికక్కడే మృతిచెందాడు. హత్య అనంతరం రజిని ఇంటి నుంచి పారిపోయి బంధువుల వద్ద తలదాచుకుంది. విశ్వసనీయ సమాచారం మేరకు కోరుట్ల సీఐ, ఎస్ఐ, సిబ్బంది ఆమెను అదుపులోకి తీసుకుని, హత్యకు ఉపయోగించిన రోకలిబండను స్వాధీనం చేసుకున్నారు. నిందితురాలిని అరెస్టు చేసి కేసు దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. సాంకేతిక ఆధారాలతో కేసును త్వరగా ఛేదించిన కోరుట్ల సీఐ, ఎస్ఐ, పోలీసు సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.



## పోచమ్మ తల్లి బోనాల్లో జీవన్‌రెడ్డి

జగిత్యాల రూరల్, జూలై 9 (ఈవార్తలు): జగిత్యాల రూరల్ మండలం నర్సింగాపూర్ గ్రామంలో నిర్వహించిన పోచమ్మ తల్లి బోనాల మహోత్సవంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగిత్యాల జిల్లా తొలి జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ ఆయనతో కలిసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వంశీ, నాయకులు గంగారెడ్డి, మహేష్, మల్లేశం గౌడ్, మహిపాల్, వేణు, తిరుపతి, మహిళలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు. పోచమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని వారు ఆకాంక్షించారు.



## 'సర్'పై ప్రజలకు భోగ శ్రావణి అవగాహన

**జగిత్యాలలో ఎస్ఐఆర్ ప్రక్రియ పరిశీలన**

జగిత్యాల టౌన్, జూలై 9 (ఈవార్తలు): జగిత్యాల పట్టణంలోని 5వ, 49వ వార్డుల్లో కొనసాగుతున్న ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ఓటరు నమోదు ప్రక్రియను బీజేపీ జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జి డా. భోగ శ్రావణి గురువారం స్థానిక వార్డు కౌన్సిలర్లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించడం అత్యంత అవసరమన్నారు. పార్టీ సూచనల మేరకు బీజేపీ బీఎల్ఏ ఏజెంట్లు, ఐటీ, లీగల్ సెల్ సభ్యులు, కార్యకర్తలు ప్రతి బూత్ స్థాయిలో ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ నమోదు ప్రక్రియను విజయవంతం చేయడానికి కృషి చేస్తారని తెలిపారు. ఓటరు జాబితాను పారదర్శకంగా, ఖచ్చితంగా రూపొందించే క్రమంలో చనిపోయిన వారి పేర్లు, అర్హత లేని లేదా నకిలీ ఓట్లు, ఇతర ప్రాంతాలకు లేదా విదేశాలకు వెళ్లిన వారి పేర్లను నిబంధనల ప్రకారం తొలగించే ప్రక్రియ కొనసాగుతుందని చెప్పారు. అర్హత కలిగిన ప్రతి ఓటరు తమ ఓటు హక్కును పరిరక్షించుకునే బాధ్యతతో అవసరమైన పత్రాలను సమర్పించి, ఓటరు జాబితాలో తమ పేరును తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రతి వార్డు, ప్రతి బూత్‌లో నమోదు ప్రక్రియను పూర్తి స్థాయిలో నిర్వహించి ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు, బూత్ స్థాయి కార్యకర్తలకు ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో 5వ వార్డు కౌన్సిలర్ వేముల శ్రీనివాస్, 49వ వార్డు కౌన్సిలర్ సిరిపురపు శ్రీలత--శ్రీనివాస్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు దూరిశెట్టి మమత, కశేటి తిరుపతి, బద్దెల గంగరాజం, బూత్ లెవెల్ ఏజెంట్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ప్రశ్న రావణ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి

**భారత్ సురక్ష సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏసీఎస్ రాజు**

జగిత్యాల, జూలై 9 (ఈవార్తలు): ప్రశ్న రావణ్‌తో పాటు ఆయనకు సహకరిస్తున్న వారిపై సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని భారత్ సురక్ష సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏసీఎస్ రాజు డిమాండ్ చేశారు. గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రశ్న రావణ్ హిందూ దేవతలు, సనాతన ధర్మంపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. దేశంలో కుల, మత విభేదాలను రెచ్చగొట్టేలా వ్యవహరిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే నటుడు ప్రకాశ్ రాజ్ సహా ఈ వ్యవహారానికి సంబంధం ఉన్న వారిపైనా విచారణ జరిపి నిజానిజాలు వెలుగులోకి తీసుకురావాలని ప్రభుత్వాన్ని, పోలీసులను కోరారు. కార్యక్రమంలో 22వ వార్డు కౌన్సిలర్ అరవ లక్ష్మి, వేముల పోచమల్లు, వేముల దేవరాజం, కొత్తకొండ బాలన్న, నరేందుల శ్రీనివాస్, గాదాసు భూమన్న, చిలుక రాజన్న, వడ్డేపల్లి మురళి, నాయని సంజీవరావు, బొందుకూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## బాలికలకు అరవ లక్ష్మి ప్లేట్లు, గ్లాసుల పంపిణీ

జగిత్యాల, జూలై 9 (ఈవార్తలు): జగిత్యాల పట్టణంలోని ప్రభుత్వ బాలికల వసతి గృహంలో సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం ప్రతి సంవత్సరం అందించే ప్లేట్లు, గ్లాసులను గురువారం స్థానిక కౌన్సిలర్ అరవ లక్ష్మి విద్యార్థినులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అరవ లక్ష్మి మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ హాస్టళ్లలో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తోందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, వసతి గృహ సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థినులు విద్యలో రాణించాలని సూచించారు. మరింత మంది విద్యార్థినులు ప్రభుత్వ హాస్టళ్లలో చేరి ప్రయోజనం పొందాలని కోరారు. హాస్టల్ వెల్ఫేర్ అధికారి టి. శ్రీలత మాట్లాడుతూ.. ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని విద్యార్థినులకు సూచించారు. కార్యక్రమంలో హాస్టల్ సిబ్బంది, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

## వయ్యారి చిత్రం



త్రిప్తి

## జననాయగన్‌కు ‘ఏ’ సర్టిఫికెట్

కోలీవుడ్ స్టార్ హీరోగా ఎన్నో బ్లాక్‌బస్టర్ సినిమాలతో ఫ్యాన్స్‌ను అలరించిన విజయ్ ఇప్పుడు పూర్తి స్థాయిలో రాజకీయాలపై దృష్టి సారిస్తున్న సంగతి తెలిసిందే. ఆయన నటుడిగా ప్రేక్షకుల ముందుకు రానున్న ఆఖరి సినిమా జన నాయగన్ కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై దేశవ్యాప్తంగా భారీ ఆసక్తి నెలకొంది. ఈ నేపథ్యంలో సినిమా సెన్సార్ ను పూర్తి చేసుకోవడం చిత్రబృందానికి కీలక మైలురాయిగా మారింది. తాజాగా సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ ఈ సినిమాకు ‘ఏ’ సర్టిఫికెట్ ను జారీ చేసింది. సీబీఎఫ్‌సీ అఫీషియల్ రికార్డ్స్ ప్రకారం ఈ సినిమా రన్ టైమ్ 183 నిమిషాలుగా తెలుస్తోంది. అంటే మూడు గంటల మూడు నిమిషాలుగా నమోదైంది. అయితే సెన్సార్ సభ్యులు చిత్రయూనిట్‌కు ఎలాంటి సవరణలను సూచించారు? ఏ సీన్స్‌లో మార్పులు జరిగాయనే వివరాలు మాత్రం ఇంకా అఫీషియల్‌గా తెలియలేదు. దీంతో సినిమా కంటెంట్ ఎలా ఉండబోతోందన్న ఆసక్తి అభిమానుల్లో మరింత పెరిగింది.







## లెనిన్‌కు యూ/ఏ సర్టిఫికెట్

అక్కినేని అఖిల్ లీడ్ రోల్ లో నటించిన లెనిన్ మూవీకి యూ/ఏ సర్టిఫికెట్ దక్కింది. వరుస ఫ్లాపుల తర్వాత అఖిల్ కు ఇది కీలకమైన సినిమా కావడంతో ఫ్యాన్స్ తో పాటు అంతా కూడా రిజల్ట్ పై ఫోకస్ పెట్టారు. మంచి టాక్ వస్తే ఆ చిత్రం కేవలం కమ్ బ్యాక్ మూవీగా మాత్రమే కాకుండా అఖిల్ కెరీర్ లోనే అతిపెద్ద విజయాల్లో ఒకటిగా నిలిచే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మురళీ కిషోర్ అబ్బూరు దర్శకత్వంలో రూపొందిన ఆ రూరల్ మాస్ యాక్షన్ ఎంటర్టైనర్ లో అఖిల్ కంప్లీట్ మాస్ అవతార్ లో కనిపించనున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్, సాంగ్స్ ఆడియన్స్‌లో అంచనాలను పెంచాయి. ముఖ్యంగా గత చిత్రాలతో పోలిస్తే అఖిల్ లుక్, బాడీ లాంగ్వేజ్, యాక్షన్ ఎలివేషన్స్ కొత్తగా ఉండటంతో సినిమాపై పాజిటివ్ బజ్ ఏర్పడింది. ట్రేడ్ వర్గాల అంచనాల ప్రకారం, సినిమా థియేట్రికల్ బిజినెస్ దాదాపు రూ.24 కోట్ల వరకు జరిగినట్లు తెలుస్తోంది. దీంతో డిస్ట్రిబ్యూటర్లు సేఫ్ జోన్ లోకి రావాలంటే ప్రపంచవ్యాప్తంగా సుమారు రూ.25 కోట్ల షేర్ వసూళ్లు రావాల్సి ఉంటుంది. గ్రాస్ పరంగా చూస్తే దాదాపు రూ.50 కోట్ల మార్క్ ను అందుకుంటే సినిమా కమర్షియల్ గా స్ట్రాంగ్ విజయాన్ని నమోదు చేసినట్లేనని ఎక్స్పర్ట్స్ భావిస్తున్నారు.

## మైసా కోసం నీళ్లలో రష్మిక ఫైట్స్

స్టార్ హీరోయిన్ రష్మిక మందన్న మరోసారి తన కమిట్మెంట్ తో హాట్ టాపిక్ గా మారారు. వరుస పాన్ ఇండియా సినిమాలతో బిజీగా ఉన్న ఆమె, ఇప్పుడు మైసా సినిమా కోసం తీసుకుంటున్న రిస్క్ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ముఖ్యంగా సినిమా కోసం ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీలో తొలిసారిగా రూపొందించిన మహిళా అండర్ వాటర్ ఫైట్ సీక్వెన్స్ ను సక్సెస్ ఫుల్ గా పూర్తి చేయడం విశేషంగా మారింది. దీంతో మైసాపై ప్రేక్షకుల్లో అంచనాలు పెరిగాయి. కొత్త దర్శకుడు రవీంద్ర పుల్లే తెరకెక్కిస్తున్న ఆ యాక్షన్ థ్రిల్లర్ లో రష్మిక ఇప్పటివరకు చేయని భిన్నమైన పాత్రలో కనిపించనున్నారు. ఒరిజినల్ ఇన్సిడెంట్స్ ఆధారంగా రూపొందుతున్న ఆ చిత్రంలో ఆమె గోండు గిరిజన మహిళ పాత్రను పోషిస్తున్నారు. అందుకోసం ఫిజికల్, మెంటల్ గా ఎంతో కష్టపడినట్లు చిత్రబృందం వెల్లడించింది. తాజాగా సినిమాలోని కీలకమైన అండర్‌వాటర్ యాక్షన్ సన్నివేశాల షూటింగ్ పూర్తయిందని మేకర్స్ ప్రకటించారు.



## రామ్ కు జోడీగా సంయుక్త మీనన్

రామ్ పోతినేని కెరీర్‌లో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్న ‘రాపో23’ చుట్టూ ఆసక్తికరమైన వార్తలు వినిపిస్తున్నాయి. హీరోగా వరుస సినిమలతో ప్రేక్షకులను అలరించిన రామ్, ఈసారి పూర్తిగా కొత్త బాధ్యతను తీసుకుంటూ స్టోరీ రైటర్, డైరెక్టర్ గా కూడా తన లక్ ను టెస్ట్ చేసుకోబోతున్నారు. ఇదే ఈ సినిమాపై ఇండస్ట్రీలో భారీ అంచనాలు పెరగడానికి మెయిన్ రీజన్‌గా మారింది. తన సొంత బ్యానర్ రాపో సినిమాటిక్స్‌పై కృష్ణ పోతినేని ఈ సినిమాను నిర్మిస్తున్నారు. కెరీర్‌లో ఇప్పటివరకు చేయని స్థాయిలో భారీ బడ్జెట్‌తో ఈ ప్రాజెక్ట్ రూపొందుతున్నట్లు సినీ వర్గాల్లో డిస్కషన్ జరుగుతోంది. రామ్ డ్రీమ్ ప్రాజెక్టుగా రూపొందుతున్న ఈ సినిమాలో ప్రతీ విషయాన్ని స్వయంగా అతనే స్పెషల్ కేర్ తో ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉంటే, ఈ సినిమాలో హీరోయిన్ గా సంయుక్త మీనన్ పేరు చాలా గట్టిగా వినిపిస్తోంది. ప్రస్తుతం టాలీవుడ్ లో వరుస అవకాశాలతో బిజీగా ఉన్న సంయుక్తను ఈ ప్రాజెక్ట్ కోసం సంప్రదించినట్లు సమాచారం. అయితే దీనిపై మేకర్స్ నుంచి ఇప్పటివరకు ఎలాంటి అఫీషియల్ అనౌన్స్‌మెంట్ రాలేదు. సంయుక్తకు అసలే టాలీవుడ్ లో లక్కీ హీరోయిన్ అనే పేరుంది. ఆమె నటించిన సినిమాలన్నీ మంచి సక్సెస్ అవుతున్న నేపథ్యంలో ఒకవేళ ఈ సినిమాలో ఆమె కనుక కన్ఫర్మ్ అయితే దీనిపై అంచనాలు పెరిగే అవకాశాలుండటంతో పాటూ, సినిమాలో రామ్- సంయుక్త జంట మొదటిసారి వెండితెరపై కనిపించనుంది.



## ఫైట్స్‌లోనూ గ్లామరేనా



యాక్షన్ సినిమాల్లోని మహిళా హంతకులు లేదా గూఢచారి పాత్రలను చూపిస్తున్న విధానంపై ఖురేషీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఫీమేల్ అసాసిన్‌లను హైపర్-సెక్సువలైజ్డ్ పద్ధతిలో చూపించడం పట్ల నిరసన తెలియజేశారు. ఇటీవలే విడుదలైన ‘ఆల్ఫా’ స్పై థ్రిల్లర్ సినిమాల్లో మహిళా పాత్రలను బిగుతుగా ఉండే దుస్తుల్లో గ్లామర్ కోణంలోనే ప్రదర్శించడం వెనుక పితృస్వామ్య భావజాలం ఉందని హుమా విమర్శించారు. గూఢచారిగా చేసే పనికి, వేసుకునే దుస్తులకు సంబంధం ఉండకూడదని కానీ బాలీవుడ్ ఇప్పటికీ అలాంటి పాత చింతకాయ పచ్చడి ఆలోచనలనే అనుసరిస్తోందని ఆరోపించారు. స్త్రీలను కేవలం ఆకర్షణీయమైన బొమ్మలుగా కాకుండా బలమైన యోధులుగా చూపించాల్సిన అవసరం ఉందని ఉద్ఘాటించారు. పురుష గూఢచారులను చూపేటప్పుడు వారి యాక్షన్ , మేధస్సుకు ప్రాధాన్యత ఇస్తారు. మహిళల విషయంలో మాత్రం శరీర ఆకృతికి ప్రాధాన్యత ఇవ్వడం సమంజసం కాదని హుమా వాదించారు.

## ప్రియుడి ముద్దు పేరుతో జాన్వీ!

బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ సినిమా కెరీర్ దేదీప్య మానంగా సాగిపోతుంది. హిందీతో పాటు తెలుగులోనూ బడా ప్రాజెక్టుల్లో నటిస్తూ ఇమేజ్ ను అంతకంతకు రెట్టింపు చేసుకుంటుంది. ఇటీవలే విడుదలైన -పెద్ది-తో మరో బ్లాక్ బస్టర్ ఖాతాలో వేసుకున్న సంగతి తెలిసిందే. ఇక అమ్మడిలో ఫ్యాషన్ సెన్స్ గురించి చెప్పాల్సిన పనిలేదు. ఆ రకంగాను జాన్వీ నిత్యం మీడియాలో వార్తల్లో నిలుస్తుంటారు. తాజాగా సోదరి అన్షులా కపూర్ వివాహ రిసెప్షన్ వేడుకలో జాన్వీ అలంకరణ అభిమానుల దృష్టిని ఆకర్షించింది. మనీష్ మల్హోత్రా డిజైన్ చేసిన సిల్క్ చీరలో అద్భుతంగా కనిపించింది. చేతికి వేసుకున్న మెహందీ ద్వారా ప్రియుడు శిఖర్ పహారియాపై ఉన్న ప్రేమను చాటుకుంది. జాన్వీ మెహందీ డిజైన్‌లో హిందీలో -శిఖు- అని రాసి ఉండటం అందరినీ ఆశ్చర్యపరిచింది. ఇది శిఖర్ పహారియాకు ఉన్న ముద్దు పేరు కావడం గమనార్హం. గత కొంతకాలంగా ఇద్దరి మధ్య ఉన్న సాన్నిహిత్యం గురించి సోషల్ మీడియాలో చర్చ జరుగుతున్నా? జాన్వీ ఇలా బహిరంగంగా సంకేతాలు ఇవ్వడం వారి బంధంపై వస్తున్న ఊహాగానాలకు మరింత బలం చేకూర్చింది. ఇద్దరి మధ్య ప్రేమ ప్రయాణం చాలా కాలంగా కొనసాగుతోంది. టీనేజ్ నుంచే పరిచయమున్న ఇద్దరు ఒకానొక దశలో విడిపోయినట్లు వార్తలొచ్చాయి.






## 100వ టీ20కి చేరువలో
# అక్షర్ పటేల్

భారత్ ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ కెరీర్‌లో మరో అరుదైన ఘట్టం చేరువైంది. ఇంగ్లండ్‌తో జరిగే నాలుగో టీ20లో బరిలోకి దిగితే అతను భారత్ తరఫున 100వ టీ20 మ్యాచ్ ఆడిన ఆటగాడిగా నిలుస్తాడు. ఈ సందర్భంగా తన క్రికెట్ ప్రయాణాన్ని గుర్తు చేసుకుంటూ అక్షర్ భావోద్వేగానికి గురయ్యాడు. టీ20ల్లో అరంగేట్రం చేసినప్పుడు 100 మ్యాచ్‌లు ఆడతానని అసలు ఊహించలేదని అక్షర్ చెప్పాడు. ఇంగ్లండ్ పర్యటన తనకు ఎప్పటికీ గుర్తుండిపోతుందని అన్నాడు. ఇదే సిరీస్‌లో రెండో టీ20లో 100 వికెట్ల మైలురాయిని అందుకున్నానని, ఇప్పుడు 100వ మ్యాచ్ ఆడబోతుండటం మరింత ప్రత్యేకంగా అనిపిస్తోందని బీసీసీఐ విడుదల చేసిన వీడియోలో వెల్లడించాడు. ఈ ఘనత తన ఒక్కడిదే కాదని అక్షర్ స్పష్టం చేశాడు. తన ప్రయాణంలో సహచర ఆటగాళ్లు, కోచ్‌లు, కుటుంబ సభ్యులందరి పాత్ర ఉందని చెప్పాడు. ఒక ఆటగాడికి భారత్ తరఫున ఒక్క మ్యాచ్ ఆడటమే గొప్ప విషయమని, అలాంటిది 100 మ్యాచ్‌లు ఆడే అవకాశం రావడం ప్రతి క్రికెటర్‌కు కల నిజమవడమేనని పేర్కొన్నాడు. 2015లో టీ20ల్లో అరంగేట్రం చేసిన అక్షర్‌కు తొలి ఐదారేళ్లలో ఎక్కువ అవకాశాలు రాలేదు. ఆ సమయంలో కేవలం 15-16 మ్యాచ్‌లే ఆడానని గుర్తు చేసుకున్నాడు. 2021 నుంచి జట్టులో వరుస అవకాశాలు దక్కాయని, గత రెండు టీ20 ప్రపంచకప్‌ల్లోనూ ఆడటం తన కెరీర్‌లో మరపురాని జ్ఞాపకాలుగా నిలిచాయని తెలిపాడు. వ్యక్తిగత మైలురాళ్ల కంటే ఆటలో రోజూ మెరుగుపడటానికే తాను ఎక్కువ ప్రాధాన్యం ఇస్తానని అక్షర్ అన్నాడు. ఎన్నో తప్పిదాల నుంచి పాఠాలు నేర్చుకున్నానని, అనుభవంతో ఒత్తిడిని ఎదుర్కోవడం కూడా సులభమైందని చెప్పాడు. కెరీర్ ప్రారంభ దశ నాటి అక్షర్‌కు సలహా ఇవ్వాల్సి వస్తే.. తప్పుల నుంచి ఎంత త్వరగా నేర్చుకుంటే అంత మంచిదని చెబుతానని పేర్కొన్నాడు.

## యోగరాజ్ విద్వేషి: కపిల్ దేవ్

భారత క్రికెట్ దిగ్గజం, ప్రపంచ కప్ విజేత కపిల్ దేవ్ తన మాజీ సహచరుడు యోగరాజ్ సింగ్‌తో ఉన్న దశాబ్దాల వివాదంపై తొలిసారిగా మౌనం వీడాడు. యోగరాజ్ తన చిన్ననాటి స్నేహితుడే అయినప్పటికీ, జీవితంలో విద్వేషపూరితంగా, చేదుగా మారిన వ్యక్తులను కలవడం తనకు ఇష్టం ఉండదని స్పష్టం చేశాడు. ఓ క్రీడా ఛానెల్ పోడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ కపిల్ ఈ వ్యాఖ్యలు చేశాడు. "అతను నన్ను కౌగిలించుకోవాలనుకుంటున్నాడు, కానీ మీరు స్నేహితుడిగా వస్తేనే" అని యాంకర్ అడగ్గా, కపిల్ దేవ్ తనదైన శైలిలో స్పందించారు. "అతను ఏం చెప్పాలనుకుంటున్నాడో నాకు తెలియదు. నా వైపు నుంచి ఎలాంటి సమస్యా లేదు. నేను ఇప్పటికీ స్నేహితుడినే. కానీ, జీవితంలో చేదు అనుభవాలతో రగిలిపోయే వ్యక్తులను కలవడం నాకు నచ్చదు. సంతోషంగా ఉండే వారిని కలవడానికే ఇష్టపడతాను. జీవితంలో ముందుకు సాగిపోవాలి. మీరు రగిలిపోతూ ఉంటే ప్రజలు మిమ్మల్ని ప్రేమించరు" అని అన్నాడు. యోగరాజ్ సింగ్‌ను ఉద్దేశిస్తూ కపిల్ ఇంకా మాట్లాడుతూ.. "అతని కొడుకు (యువరాజ్ సింగ్) దేశం గర్వించేలా అద్భుతంగా రాణించాడు. కనీసం ఆ సంతోషంతోనైనా అతను ఆనందంగా జీవించాలి. జీవితంలో ఎవరికీ అన్నీ దొరకవు. కొన్నిసార్లు మీకు



దక్కుతాయి, కొన్నిసార్లు మీ కుటుంబానికి దక్కుతాయి. చివరికి మీరు సంతోషంగా ఉండాలి కానీ చేదుగా కాదు. విద్వేషపూరితమైన వ్యక్తికి ఈ ప్రపంచంలో స్థానం ఉండదు" అని హితవు పలికాడు. ప్రపంచంలో ఎన్నో చూసిన వ్యక్తి, భారత్‌కు ఆడి, సినిమాల్లో కూడా నటించిన వ్యక్తి ఇంకా అసంతృప్తితో ఉండటం సరికాదని అభిప్రాయపడ్డాడు.






# ఇంగ్లండ్‌దే సిరీస్

## నాలుగో టీ20లోనూ భారత్ ఓటమి

బ్రిస్టల్: టీ20ల్లో ప్రపంచ ఛాంపియన్‌గా ఉన్న భారత్‌కు మరో షాక్. మొన్న ఐర్లాండ్ చేతిలో రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో ఒక్క మ్యాచ్ గెలవకుండా ఘోర పరభవాన్ని మూటగట్టుకున్న టీమ్‌ఇండియా.. ఇప్పుడు ఇంగ్లాండ్‌పై కూడా సిరీస్‌ను కోల్పోయింది. భారత్‌తో జరిగిన నాలుగో టీ20లో ఇంగ్లాండ్ 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది.

దీంతో ఆతిథ్య జట్టు ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను 3-0తో ఒక మ్యాచ్ మిగిలుండగానే ఛేదించింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 7 వికెట్ల నష్టానికి 158 పరుగులు చేసింది. ఈ లక్ష్యాన్ని ఇంగ్లాండ్ 13.5 ఓవర్లలోనే ఒకే వికెట్ కోల్పోయి ఛేదించింది. జోస్ బట్లర్ (8) త్వరగానే ఔటైనా.. తర్వాత వచ్చిన హ్యారీ బ్రూక్ (79; 35 బంతుల్లో 8 ఫోర్లు, 4 సిక్సులు) చెలరేగాడు. ఫిల్ సాల్ట్ (59; 42 బంతుల్లో 9 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. నామమాత్రపు ఐదో టీ20 శనివారం సౌథాంప్టన్‌లో జరగనుంది. తొలుత టీమ్‌ఇండియా బ్యాటర్లలో కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (80; 49 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్సులు) ఒక్కడే రాణించాడు. వైభవ్ సూర్యవంశీ (15), అభిషేక్ శర్మ (16), శివమ్ దూబె (22), తిలక్ వర్మ (11), ఇషాన్ కిషన్ (4) నిరాశపర్చారు. ఇంగ్లాండ్ బౌలర్లలో జోష్ టంగ్ 2, జోఫ్రా ఆర్చర్ 2, విల్ జాక్స్, ఆదిల్ రషీద్ ఒక్కో వికెట్ పడగొట్టారు..




# ఈజిప్ట్ కోచ్‌కు బంపర్ ఆఫర్

ప్రస్తుతం జరుగుతున్న ఫిఫా ప్రపంచకప్‌లో ఈజిప్ట్ జట్టు అద్భుత ప్రదర్శన కనబరచడంతో, ఆ జట్టు హెడ్ కోచ్ హొసామ్ హసన్ కాంట్రాక్టును పొడిగిస్తున్నట్లు ఈజిప్ట్ ఫుట్‌బాల్ అసోసియేషన్ (ఈఎఫ్ఏ) ప్రకటించింది. జట్టు సాధించిన పురోగతికి గుర్తింపుగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేసింది. మొహమ్మద్ సలా నాయకత్వంలోని ఈజిప్ట్ జట్టు, 2018 తర్వాత తమ తొలి ప్రపంచకప్ ఆడుతూ రౌండ్ ఆఫ్ 16కు చేరి అందరినీ ఆకట్టుకుంది. ముఖ్యంగా ప్రీ-క్వార్టర్ ఫైనల్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనాతో జరిగిన మ్యాచ్‌లో ఫుట్‌బాల్ ప్రపంచాన్ని నివ్వెరపరిచింది. ఆ మ్యాచ్‌లో ఒక దశలో 2-0 ఆధిక్యంలో నిలిచి సంచలనానికి చేరువగా వచ్చింది. అయితే, అనుభవంలో తేడా చూపిన అర్జెంటీనా కేవలం 13 నిమిషాల వ్యవధిలో మూడు గోల్స్ చేసి, ఈజిప్ట్ నుంచి విజయాన్ని లాక్కుంది. ఓడిపోయినప్పటికీ ఈజిప్ట్ జట్టు పోరాట పటిమపై సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో ఈఎఫ్ఏ అధ్యక్షుడు హానీ అబో రిడా ఒక ప్రకటన విడుదల చేశారు. 'రాయిటర్స్' కథనం ప్రకారం.. "ఈజిప్ట్ జాతీయ జట్టు హెడ్ కోచ్ హొసామ్ హసన్, టీమ్ డైరెక్టర్ ఇబ్రహీం హసన్‌ల కాంట్రాక్టుల పునరుద్ధరణకు అసోసియేషన్ బోర్డు ఆమోదం తెలిపింది" అని ఆయన పేర్కొన్నారు. 59 ఏళ్ల హొసామ్ హసన్ 2024 ఫిబ్రవరిలో ఈజిప్ట్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టాడు. అతడి మార్గనిర్దేశనంలోనే జట్టు 2025 'ఆఫ్రికన్ కప్ ఆఫ్ నేషన్స్' (ఏఎఫ్‌సీఓఎన్)లో సెమీఫైనల్‌కు చేరింది. ఆసక్తికరంగా ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి ఎలాంటి అధికారిక కాంట్రాక్ట్ లేకుండానే తాను జట్టుతో కలిసి పనిచేస్తున్నట్లు హసన్ గతంలో వెల్లడించాడు. తాజా ప్రపంచకప్‌లో హసన్ కోచింగ్‌లోనే ఈజిప్ట్ తమ మొట్టమొదటి ప్రపంచకప్ విజయాన్ని (న్యూజిలాండ్‌పై 3-1 తేడాతో) నమోదు చేసింది. అంతేగాక రౌండ్ ఆఫ్ 32లో ఆస్ట్రేలియాను పెనాల్టీల ద్వారా ఓడించి, తమ ప్రపంచకప్ చరిత్రలోనే తొలి నాకౌట్ మ్యాచ్ గెలుపును కూడా అందుకుంది. స్థానిక మీడియా నివేదికల ప్రకారం.. ఈ కొత్త కాంట్రాక్ట్ 2030 వరకు కొనసాగే అవకాశం ఉంది. ఈ నిర్ణయం జట్టులో దీర్ఘకాలిక స్థిరత్వాన్ని తీసుకురావాలనే లక్ష్యంతో తీసుకున్నట్లు తెలుస్తోంది.

## టీజీ20 లీగ్ ఫైనల్లో ఖమ్మం

తెలంగాణ టీజీ20 లీగ్‌లో ఖమ్మం ఏసెస్ జట్టు ఫైనల్‌కు దూసుకెళ్లింది. హోరాహోరీగా సాగిన క్వాలిఫయర్-1 మ్యాచ్‌లో హైదరాబాద్ ఈ-ఛాంపియన్స్‌ను 10 పరుగుల తేడాతో ఓడించి, టైటిల్ పోరుకు అర్హత సాధించింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఖమ్మం ఏసెస్ నిర్ణీత 200/6 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఓపెనర్ సాయివికాస్ రెడ్డి కేవలం 27 బంతుల్లోనే 7 ఫోర్లు, 4 సిక్సలతో 69 పరుగులు చేసి ఇన్నింగ్స్‌కు గట్టి పునాది వేశాడు. ఆ తర్వాత గడుగు గణేశ్ (27), ప్రణవ్ వర్మ (26), వైష్ణవ్ రెడ్డి (21 నాటౌట్), అన్విత్ రెడ్డి (16), అజయ్ దేవ్ గౌడ్ (13) విలువైన పరుగులు జోడించి జట్టు స్కోరును 200 మార్కు దాటించారు. 201 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన హైదరాబాద్ ఈ-ఛాంపియన్స్ గట్టి పోటీ ఇచ్చినప్పటికీ.. నిర్ణీత 20 ఓవర్లలో 190/8 స్కోరుకే పరిమితమైంది. ఖమ్మం బౌలర్లలో సహేంద్ర మల్లు 3 వికెట్లతో హైదరాబాద్ ను కోలుకోలేని దెబ్బ తీసాడు. అతనికి తోడుగా వేద్‌రెడ్డి 2 వికెట్లు తీయగా.. హర్షిత్, విద్యానందరెడ్డి, సీవీ మిలింద్ తలో వికెట్‌తో రాణించి విజయంలో కీలక పాత్ర పోషించారు. శుక్రవారం జరిగే క్వాలిఫయర్-2 లో గెలిచిన జట్టుతో ఆదివారం జరిగే మహాసంగ్రామంలో అన్విత ఖమ్మం ఏసెస్ తలపడనుంది.

## వాళ్లకు కెప్టెన్సీ, వైస్ కెప్టెన్సీ రక్షణ:కైఫ్

భారత మాజీ ఆటగాడు మహ్మద్ కైఫ్, టీమిండియా టీ20 జట్టు యాజమాన్యంపై, ముఖ్యంగా కెప్టెన్సీ ఎంపికలపై తీవ్ర విమర్శలు చేశాడు. శ్రేయస్ అయ్యర్‌ను కెప్టెన్‌గా, తిలక్ వర్మను వైస్ కెప్టెన్‌గా నియమించడం వల్లే వారు జట్టులో "తప్పించలేని" ఆటగాళ్లుగా మారిపోయారని, ఇది సంజూ శాంసన్ వంటి ఫామ్‌లో ఉన్న ఆటగాడికి అన్యాయం చేస్తోందని ఆరోపించాడు. ఐర్లాండ్‌తో 0-2 తేడాతో సిరీస్ కోల్పోయి, ప్రస్తుతం ఇంగ్లండ్‌తో సిరీస్‌లోనూ 0-2తో వెనుకబడిన నేపథ్యంలో కైఫ్ ఈ వ్యాఖ్యలు చేశాడు. తన యూట్యూబ్ ఛానెల్‌లో మాట్లాడుతూ, ఫామ్ ఆధారంగా చూస్తే శ్రేయస్, తిలక్ వర్మలకు తుది జట్టులో స్థానం గ్యారెంటీ కాదని, అయితే కెప్టెన్సీ, వైస్ కెప్టెన్సీ పదవులు వారికి రక్షణ కవచంలా మారాయని విశ్లేషించాడు. ఈ కారణంగానే సంజూ




శాంసన్‌తో పాటు అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ వంటి యువ ఆటగాళ్లకు అవకాశాలు దక్కడం లేదని అన్నాడు. ఇటీవలి కాలంలో టీ20 జట్టులో సభ్యుడు కూడా కాని శ్రేయస్ అయ్యర్‌ను నేరుగా కెప్టెన్‌గా ఎలా నియమిస్తారని కైఫ్ ప్రశ్నించాడు. భారత క్రికెట్ చరిత్రలో ఇలాంటి నిర్ణయం ఎప్పుడూ జరగలేదని గుర్తుచేశాడు. అయ్యర్‌ను నేరుగా కెప్టెన్ చేయకుండా, జట్టులోకి నెమ్మదిగా తీసుకొచ్చి ఉంటే ఇతర ఆటగాళ్లకు మెరుగైన అవకాశాలు లభించేవని అభిప్రాయపడ్డాడు. టీ20 ప్రపంచకప్ గెలిచిన సూర్యకుమార్ యాదవ్ స్థానంలో శ్రేయస్ కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టినప్పటికీ, ఇప్పటివరకు ఒక్క విజయాన్ని కూడా అందించలేకపోయాడు. కైఫ్ వ్యాఖ్యలు పరోక్షంగా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, సెలెక్టర్ల నిర్ణయాలను ప్రశ్నించేలా ఉన్నాయని క్రీడా విశ్లేషకులు భావిస్తున్నారు.

ఈవార్తలు
# ప్రజావాణి
www.evarthalu.com
నేటి ఈవార్తలు
శుక్రవారం 10-7-2026, జగిత్యాల


నేటి ఈవార్తలు | సంపాదకీయం | Editorial

# రైతు భవిష్యత్తు ఎటు?

**భారతదేశంలో** రైతు జీవితాన్ని నిర్ణయించే అతిపెద్ద శక్తి ఇప్పటికీ ప్రకృతే. సాంకేతికత ఎంత అభివృద్ధి చెందినా, యంత్రాలు ఎంత ఆధునికమైనా, పంటకు తొలి ప్రాణం వర్షమే. అందుకే ప్రతి ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో రైతు చూపు ఆకాశంపైనే ఉంటుంది. తెలంగాణలో ఈ ఏడాది కూడా అదే దృశ్యం కనిపిస్తోంది. దుక్కులు సిద్ధం చేశారు. విత్తనాలు కొనుగోలు చేశారు. ఎరువులు సమకూర్చుకున్నారు. బ్యాంకులు, ప్రైవేటు అప్పుల ద్వారా పెట్టుబడులు సమకూర్చుకున్నారు. కానీ ఆ పెట్టుబడులకు జీవం పోసే వాన మాత్రం ఇంకా రైతును పరీక్షిస్తూనే ఉంది. వ్యవసాయం కేవలం ఒక వృత్తి కాదు; అది కోట్లాది కుటుంబాల జీవనాధారం. రైతు పంట పండితేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కదులుతుంది. వ్యవసాయ కూలీలకు పని దొరుకుతుంది. విత్తనాలు, ఎరువులు, యంత్రాలు, రవాణా, మార్కెట్లు అన్నీ చురుకుగా మారతాయి. రైతు నష్టపోతే దాని ప్రభావం ఒక్క పొలంలోనే కాదు, మొత్తం ఆర్థిక వ్యవస్థపై పడుతుంది. ఈ ఏడాది వర్షాలు ఆలస్యం కావడంతో ఖరీఫ్ సాగు అనేక ప్రాంతాల్లో వెనుకబడింది. నేలలో తేమ లేక రైతులు విత్తనాలు వేయడానికి వెనుకంజ వేస్తున్నారు. కొందరు తొందరపడి విత్తిన విత్తనాలు కూడా తగినంత తేమ లేక మొలకెత్తకపోవడంతో మళ్లీ సాగు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఇది రైతుపై అదనపు ఆర్థిక భారాన్ని మోపుతోంది. వాతావరణ మార్పులు ప్రపంచవ్యాప్తంగా వ్యవసాయాన్ని ప్రభావితం చేస్తున్నాయి. ఒకప్పుడు క్రమబద్ధంగా కురిసే వర్షాలు ఇప్పుడు అనిశ్చితంగా మారాయి. కొన్నిచోట్ల భారీ వర్షాలు, మరికొన్ని ప్రాంతాల్లో తీవ్రమైన ఎండలు సాధారణమవుతున్నాయి. ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని వ్యవసాయ విధానాలు కూడా మారాలి. సంప్రదాయ పద్ధతులతోనే ముందుకు సాగితే భవిష్యత్తులో రైతు మరిన్ని ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. అయితే ప్రకృతిని నిందించడం మాత్రమే సరిపోదు. వర్షాభావాన్ని ఎదుర్కొనే సిద్ధతలో ప్రభుత్వాల పాత్ర కూడా అంతే కీలకం. వర్షాకాలానికి ముందే చెరువుల పూడికతీత, కాల్వల శుభ్రత, వర్షపు నీటి సంరక్షణ, సూక్ష్మ సాగునీటి పథకాల విస్తరణ, ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన వంటి చర్యలు మరింత సమర్థంగా అమలైతే పరిస్థితి కొంత మెరుగుపడేది. నీటి నిర్వహణలో శాస్త్రీయ దృష్టి లేకపోవడం వల్ల ఒకవైపు వర్షాలు లేక ఇబ్బంది పడుతుంటే, మరోవైపు కురిసిన కొద్దిపాటి వర్షపు నీరు కూడా వృథాగా సముద్రంలో కలిసిపోతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. తెలంగాణ చెరువుల సంస్కృతికి ప్రసిద్ధి. వేలాది చెరువులు ఒకప్పుడు గ్రామీణ జీవనానికి ఆధారంగా నిలిచాయి. కానీ నేడు వాటిలో అనేకం పూడికతో నిండిపోవడం, ఆక్రమణలకు గురికావడం, నిర్వహణ లోపించడం వల్ల వాటి నిల్వ సామర్థ్యం తగ్గుతోంది. వర్షాలు ఆలస్యమైన ఈ సమయంలో అయినా చెరువుల పునరుద్ధరణ, భూగర్భ జలాల పెంపు, వర్షపు నీటి నిల్వపై ప్రభుత్వం అత్యవసర దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. రైతు ఎదుర్కొంటున్న సమస్యలు కేవలం వర్షాలతో ముగియవు. నకిలీ విత్తనాలు, పెరుగుతున్న ఎరువుల ధరలు, కూలీల కొరత, విద్యుత్ సమస్యలు, మార్కెట్‌లో ధరల అనిశ్చితి, పంట బీమా అమలులో జాప్యం.. ఇవన్నీ కలిసి రైతును మరింత ఇబ్బందుల్లోకి నెడుతున్నాయి. వర్షాభావం వీటన్నింటినీ మరింత తీవ్రతరం చేస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో వ్యవసాయానికి సాంకేతికతను మరింత చేరువ చేయాలి. గ్రామస్థాయిలో ఖచ్చితమైన వాతావరణ అంచనాలు, తక్కువ కాలంలో పండే పంటలపై సలహాలు, నేల తేమను కాపాడే పద్ధతులు, డ్రిప్, స్ప్రింక్లర్ వంటి సూక్ష్మ సాగునీటి వ్యవస్థలను విస్తృతంగా ప్రోత్సహించాలి. ప్రతి మండలంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు ప్రత్యక్ష మార్గదర్శకత్వం అందించే విధానం బలోపేతం కావాలి. అలాగే పంట బీమా వ్యవస్థను మరింత సమర్థంగా అమలు చేయాలి. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతుకు నెలల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉండకూడదు. నష్టాన్ని త్వరగా అంచనా వేసి, పారదర్శకంగా పరిహారం అందించే వ్యవస్థపై దృష్టి పెట్టాలి. వ్యవసాయం దేశ ఆహార భద్రతకు మూలాధారం. రైతు బలహీనపడితే దేశ ఆర్థిక వ్యవస్థ కూడా ప్రభావితమవుతుంది. అందుకే వ్యవసాయాన్ని కేవలం సంక్షేమ కార్యక్రమంగా కాకుండా వ్యూహాత్మక రంగంగా చూడాల్సిన అవసరం ఉంది. వర్షాలపై ఆధారపడే వ్యవసాయాన్ని క్రమంగా నీటి నిర్వహణ, సాంకేతికత, శాస్త్రీయ ప్రణాళికలతో బలోపేతం చేయాల్సిన సమయం ఆసన్నమైంది.



## మూసీ నది పునరుజ్జీవనం
# పొందేనా!

హైదరాబాద్ నగరానికి జీవనాడిగా ఒకప్పుడు గుర్తింపు పొందిన మూసీ నది నేడు కాలుష్యం, ఆక్రమణలు, మురుగునీటి ప్రవాహాలతో తన ఉనికినే కోల్పోయే పరిస్థితికి చేరుకుంది. నగర విస్తరణతో పాటు సరైన ప్రణాళిక లేకపోవడం వల్ల మూసీ సహజ ప్రవాహం దెబ్బతింది. వరదలు వచ్చినప్పుడు ప్రమాదం, ఎండాకాలంలో దుర్వాసన, కాలుష్యం.. ఇవే మూసీ నదికి నేటి గుర్తింపుగా మారాయి. ప్రతి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు మూసీ పునరుజ్జీవనంపై భారీ ప్రణాళికలు, అందమైన చిత్రాలు, వేల కోట్ల రూపాయల అంచనాలు ప్రకటించడం పరిపాటిగా మారింది. నది తీరాల అభివృద్ధి, మురుగునీటి శుద్ధి, ఆక్రమణల తొలగింపు, పార్కుల ఏర్పాటు, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడం వంటి హామీలు వినిపిస్తుంటాయి. అయితే ప్రకటనల స్థాయిలో కనిపించిన వేగం, కార్యాచరణలో కనిపించకపోవడం ప్రజల్లో నిరాశను కలిగిస్తోంది. మూసీ పునరుజ్జీవనం అంటే కేవలం నది ఒడ్డున అందమైన రహదారులు లేదా ఉద్యానవనాలు నిర్మించడం కాదు. ముందుగా శుద్ధి చేయని మురుగునీరు నదిలో కలవకుండా అడ్డుకోవాలి. నగరంలోని మురుగునీటి శుద్ధి కేంద్రాల సామర్థ్యాన్ని పెంచాలి. ఆక్రమణలను చట్టబద్ధంగా తొలగించి, వరద నీరు స్వేచ్ఛగా ప్రవహించేలా సహజ మార్గాన్ని పునరుద్ధరించాలి. పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థాలపై కఠిన నియంత్రణ అవసరం. ప్రపంచంలోని అనేక నగరాలు ఒకప్పుడు కాలుష్యంతో నిండిన నదులను తిరిగి జీవంతో నింపాయి. అదే సంకల్పం హైదరాబాద్‌లోనూ అవసరం. మూసీని కాపాడటం అంటే కేవలం ఒక నదిని రక్షించడం కాదు; నగర పర్యావరణాన్ని, భూగర్భ జలాలను, ప్రజారోగ్యాన్ని, భవిష్యత్తు తరాలకు అవసరమైన సహజ వనరును కాపాడటం. మూసీ పునరుజ్జీవనం ప్రకటనలకే పరిమితం కాకుండా, నిర్దిష్ట కాలపట్టిక, పారదర్శక అమలు, ప్రజల భాగస్వామ్యంతో ముందుకు సాగితేనే ఫలితాలు కనిపిస్తాయి. మూసీ మళ్లీ ప్రవహిస్తే అది కేవలం నీటి ప్రవాహం కాదు.. హైదరాబాద్ పర్యావరణ పునరుజ్జీవనానికి కొత్త ఆరంభం అవుతుంది.



- వెంకటేశ్ గుగ్గిళ్ల, ఈవార్తలు దినపత్రిక రిపోర్టర్

పారిశ్రామిక విప్లవం మానవ శ్రమను మార్చింది. కంప్యూటర్ విప్లవం కార్యాలయాలను మార్చింది. ఇప్పుడు కృత్రిమ మేధ విప్లవం ఆలోచనా విధానాన్నే మార్చుతోంది. సమాచారం సేకరించడం, విశ్లేషించడం, నివేదికలు రూపొందించడం, చిత్రాలు సృష్టించడం, కంప్యూటర్ ప్రోగ్రామింగ్, అనువాదం, వైద్య నిర్ధారణ, న్యాయ పరిశోధన, కస్టమర్ సేవలు-ఇలా ఎన్నో రంగాల్లో కృత్రిమ మేధ వేగంగా విస్తరిస్తోంది. ఇది కేవలం సాంకేతిక మార్పు మాత్రమే కాదు; ప్రపంచ ఉపాధి వ్యవస్థను తిరిగి నిర్వచించే పరిణామం.




ప్రపంచంలోనే అత్యధిక యువ జనాభా కలిగిన దేశంగా భారత్‌కు ఈ మార్పు ఒకేసారి అవకాశం కూడా, సవాలు కూడా. ప్రతి సంవత్సరం లక్షలాది మంది యువత ఉద్యోగ మార్కెట్లోకి అడుగుపెడుతున్నారు. అదే సమయంలో పరిశ్రమలు తమ పనితీరును మరింత సమర్థవంతంగా మార్చుకోవడానికి ఏఐ ఆధారిత వ్యవస్థలను స్వీకరిస్తున్నాయి. ఈ రెండు ధోరణులు కలిసి భారత ఉపాధి రంగంలో కొత్త సమీకరణాలను సృష్టిస్తున్నాయి. భయం ఎక్కువగా వినిపిస్తున్న ప్రశ్న ఒక్కటే.. ఏఐ ఉద్యోగాలను తీసేస్తుందా? దీనికి సరళమైన సమాధానం లేదు. కొన్ని సంప్రదాయ ఉద్యోగాలు తగ్గే అవకాశం ఉంది. ముఖ్యంగా ఒకే విధమైన, పునరావృతమయ్యే పనులు చేసే రంగాల్లో ఆటోమేషన్ పెరుగుతుంది. డేటా ఎంట్రీ, ప్రాథమిక అకౌంటింగ్, సాధారణ కస్టమర్ సపోర్ట్, డాక్యుమెంట్ ప్రాసెసింగ్ వంటి పనులను ఏఐ వేగంగా నిర్వహిస్తోంది. దీని వల్ల కొన్ని ఉద్యోగాల స్వరూపం మారడం సహజం. అయితే చరిత్ర చెబుతున్న విషయం ఏమిటంటే, ప్రతి సాంకేతిక విప్లవం కొన్ని ఉద్యోగాలను తగ్గించినా, కొత్త రకాల ఉద్యోగాలను కూడా సృష్టించింది. కంప్యూటర్లు వచ్చినప్పుడు బ్యాంకుల్లో ఉద్యోగాలు ఉండవని అనుకున్నారు. కానీ నేడు ఐటీ, సాఫ్ట్‌వేర్, సైబర్ సెక్యూరిటీ, డిజిటల్ సేవలు లక్షలాది మందికి ఉపాధిని కల్పిస్తున్నాయి. అదే విధంగా ఏఐ కూడా కొత్త అవకాశాలకు మార్గం వేస్తోంది. భారత్‌కు ఉన్న ప్రధాన బలం యువశక్తి, సాంకేతిక నైపుణ్యం, ప్రపంచ స్థాయి ఐటీ పరిశ్రమ. ఇప్పటికే హైదరాబాద్, బెంగళూరు, పుణే, చెన్నై, గురుగ్రామ్ వంటి నగరాలు ఏఐ పరిశోధన, సాఫ్ట్‌వేర్ అభివృద్ధి, గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లకు కేంద్రాలుగా ఎదుగుతున్నాయి. అంతర్జాతీయ కంపెనీలు భారత ఇంజినీర్లపై విశ్వాసం ఉంచుతున్నాయి. ఈ పరిస్థితిని సద్వినియోగం చేసుకుంటే భారత్ ప్రపంచ ఏఐ కేంద్రంగా ఎదిగే అవకాశం ఉంది. అయితే ఒక కీలక ప్రశ్నను విస్మరించకూడదు. ఏఐ యుగానికి మన విద్యా వ్యవస్థ సిద్ధంగా ఉందా? ఇప్పటికీ అనేక విద్యాసంస్థల్లో పాత పద్ధతులకే ప్రాధాన్యం ఉంది. ఉద్యోగ మార్కెట్ కోరుతున్న నైపుణ్యాలు, విద్యాసంస్థలు బోధిస్తున్న అంశాల మధ్య అంతరం కనిపిస్తోంది. భవిష్యత్తులో కేవలం డిగ్రీ సరిపోదు. సమస్యలను పరిష్కరించే సామర్థ్యం, విశ్లేషణాత్మక ఆలోచన, సృజనాత్మకత, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, డిజిటల్ పరిజ్ఞానం, ఏఐతో కలిసి పనిచేసే సామర్థ్యమే ప్రధాన అర్హతగా మారనుంది.

వ్యవసాయం నుంచి ఆరోగ్య రంగం వరకు ఏఐ ప్రభావం విస్తరిస్తోంది. రైతుకు పంట వ్యాధులను ముందుగానే గుర్తించే యాప్‌లు, వైద్యుడికి వ్యాధి నిర్ధారణలో సహాయపడే వ్యవస్థలు, విద్యార్థులకు వ్యక్తిగత అభ్యాస వేదికలు, న్యాయరంగంలో కేసుల విశ్లేషణ, పరిశ్రమల్లో నాణ్యత నియంత్రణ-ఇలా ప్రతి రంగంలో ఏఐ సహాయకుడిగా మారుతోంది. అంటే మనిషిని పూర్తిగా భర్తీ చేయడం కంటే, అతని పనితీరును మెరుగుపరచే సాధనంగా కూడా దీనిని చూడాలి. భారత్‌లో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు కూడా ఏఐని అందుబాటులోకి తెచ్చుకోవాలి. పెద్ద కంపెనీలకే పరిమితమైతే డిజిటల్ అసమానత పెరుగుతుంది. చిన్న పరిశ్రమలకు తక్కువ ఖర్చుతో ఏఐ ఆధారిత పరిష్కారాలు, శిక్షణ, డిజిటల్ మౌలిక సదుపాయాలు అందించడం అవసరం. అదే సమయంలో గ్రామీణ యువత కూడా ఈ మార్పులో భాగస్వాములు కావాలి. లేదంటే నగర-గ్రామాల మధ్య నైపుణ్య అంతరం మరింత పెరిగే ప్రమాదం ఉంది. ఏఐ అభివృద్ధితో మరో ముఖ్యమైన అంశం నైతికత. నియామకాలలో వివక్ష, వ్యక్తిగత డేటా దుర్వినియోగం, డీప్‌ఫేక్‌లు, తప్పుడు సమాచారం, మేధోసంపత్తి హక్కులు వంటి సమస్యలు కొత్త సవాళ్లను సృష్టిస్తున్నాయి. అందుకే సాంకేతిక అభివృద్ధితో పాటు బాధ్యతాయుత వినియోగానికి చట్టాలు, నియంత్రణలు, పారదర్శక విధానాలు కూడా అవసరం.

ప్రభుత్వం ఇప్పటికే డిజిటల్ ఇండియా, స్కిల్ ఇండియా, స్టార్టప్ ఇండియా వంటి కార్యక్రమాల ద్వారా సాంకేతికతకు ప్రోత్సాహం ఇస్తోంది. ఇప్పుడు వీటిని ఏఐ నైపుణ్యాభివృద్ధితో మరింత బలోపేతం చేయాలి. పాఠశాల స్థాయి నుంచే డిజిటల్ అక్షరాస్యత, ప్రోగ్రామింగ్, డేటా విశ్లేషణ, ఏఐ పునాది అంశాలను పరిచయం చేయాలి. విశ్వవిద్యాలయాలు పరిశ్రమలతో కలిసి ఉద్యోగ మార్కెట్‌కు అవసరమైన కోర్సులను రూపొందించాలి. ఉద్యోగుల్లో నిరంతర నైపుణ్యాభివృద్ధి సంస్కృతి పెంపొందించాలి. భారత్ 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా అవతరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ లక్ష్య సాధనలో ఏఐ కీలక పాత్ర పోషిస్తుంది. కానీ ఈ సాంకేతికత వల్ల కలిగే ప్రయోజనాలు కొద్దిమందికే పరిమితం కాకుండా సమాజంలోని ప్రతి వర్గానికి చేరాలి. మహిళలు, గ్రామీణ యువత, చిన్న వ్యాపారులు, ప్రభుత్వ ఉద్యోగులు.. అందరికీ ఏఐ ఆధారిత శిక్షణ, అవకాశాలు అందుబాటులో ఉండాలి. కృత్రిమ మేధను ఉద్యోగాల శత్రువుగా చూడడం సరైంది కాదు. అదే సమయంలో దాని ప్రభావాన్ని తక్కువ అంచనా వేయడం కూడా ప్రమాదకరం. ప్రతి సాంకేతిక విప్లవం మాదిరిగానే ఇది కూడా మార్పును తీసుకొస్తుంది. ఆ మార్పుకు సిద్ధమైనవారికి ఇది అపార అవకాశాలను అందిస్తుంది; సిద్ధం కానివారికి సవాళ్లను మిగులుస్తుంది. భారత్ ముందున్న అసలు పరీక్ష ఏఐని అభివృద్ధి చేయడంలో మాత్రమే లేదు; ఏఐతో కలిసి పనిచేయగల మానవ వనరులను తీర్చిదిద్దడంలో ఉంది. నైపుణ్యాభివృద్ధి, నాణ్యమైన విద్య, పరిశోధన, బాధ్యతాయుత విధానాలు, సమగ్ర అవకాశాలు-ఈ ఐదు స్తంభాలపై భారత్ దృష్టి పెడితే కృత్రిమ మేధ యుగంలో ప్రపంచ ఉపాధి పటంలో అగ్రస్థానాన్ని దక్కించుకోగలదు. యంత్రాలు వేగంగా పనిచేయగలవు. కానీ దిశను నిర్ణయించేది మనిషే. ఏఐ భవిష్యత్తును నిర్మించవచ్చు; ఆ భవిష్యత్తులో ప్రతి భారతీయుడికి గౌరవప్రదమైన ఉపాధి కల్పించే బాధ్యత మాత్రం సమాజానిదే, ప్రభుత్వానిదే.



రణధీర్ గుండు, హైదరాబాద్

## రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.